

ఉష్ణోగ్రత శనివారం గరిష్ఠం : 33.0 కనిష్ఠం : 25.0

నేటి నుంచి రేషన్ షాపుల్లోనే సరుకులు

రోజుకు రెండుపూటలా పంపిణీకి చర్యలు

అనంతపురం టౌన్, మే 31(ఆంధ్రజ్యోతి): పాత పద్ధతిలో రేషన్ సరుకుల పంపిణీ ఆదివారం నుంచి చేపడుతున్నారు. రేషన్ డీలర్ల ద్వారానే మళ్లీ లబ్ధిదారులకు సరుకులు అందించాలని ఇప్పటికే సర్కారు ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మేరకు జిల్లాలో రేషన్ షాపుల ద్వారా సరుకుల పంపిణీకి యంత్రాంగం ఏర్పాట్లు సిద్ధం చేసింది. జిల్లా వ్యాప్తంగా 1,645 రేషన్ షాపుల పరిధిలో 6,60,330 కార్డులున్నాయి. లబ్ధిదారులకు ఒకటి నుంచి 15వతేదీ వరకు సరుకులు అందజేస్తారు. రోజూ రెండు పూటలా పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు డీలర్లు సరుకులు ఇవ్వాల్సి ఉంటుంది. ఆదివారాలు కూడా పంపిణీ చేయనున్నారు. 65ఏళ్ల పైబడిన లబ్ధిదారులు, నడవలేని దివ్యాంగులకు ఇళ్ల వద్దకే డీలర్లు సరకులు పంపిణీ చేయాల్సి ఉంది. ఆ మేరకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఆయా నియోజకవర్గ, మండల ప్రజాప్రతినిధులు, అధికారులు పంపిణీని ప్రారంభించనున్నారు.

ఆశల ఆకాశం..

నేటి నుంచి ఖరీఫ్ సీజన్

- 80 శాతం దుక్కులు పూర్తి
- పదును వర్షం కోసం అన్నదాతల ఎదురుచూపు
- చినుకు పడితే విత్తుకు రెడీ..!
- ఈసారి ముందస్తుగానే జిల్లాకు నైరుతి



గుత్తి మండలం గొందిపల్లి వద్ద విత్తనం వేసేందుకు సిద్ధం చేసిన పొలం

అనంతపురం అర్బన్/గుత్తి రూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాల ఆగమనం, వర్షాలు, దుక్కులు అన్నీ ఈ ఏడాది ముందస్తుగానే జరిగాయి. విత్తనం వేసేందుకు రైతు సిద్ధంగా ఉన్నాడు. ఈ నేపథ్యంలో అన్నదాతల ఆశల సీజన్ ఖరీఫ్ కూడా వచ్చేసింది. ఆదివారం ప్రారంభంకానుంది. దీంతో మళ్లీ వర్షం కురిస్తే విత్తనం వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఏటా జూన్ 1న ఖరీఫ్ సీజన్ ప్రారంభమై సెప్టెంబరు నెలాఖరుతో ముగిసేది. ఖరీఫ్‌లో జిల్లాలోని మెట్ట భూముల్లో వర్షాధారం కింద ప్రధాన పంటగా వేరుశనగ సాగు చేస్తున్నారు. ఈ ఏడాది జిల్లా సాధారణ సాగు విస్తీర్ణం 3.43 లక్షల హెక్టార్లుగా నిర్ణయించారు. ఇందులో వేరుశనగ 1.82 లక్షలు, కంది 55,296, పత్తి 44 వేలు, (మిగతా 6లో..)

వైసీపీ పాలనలో ఆర్థిక వ్యవస్థ కుదేలు

- ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమానికి ప్రాధాన్యం
- మంత్రి పయ్యావుల కేశవ్
- గొట్కూరులో పింఛన్ సొమ్ము పంపిణీ



పింఛన్ సొమ్ము అందజేస్తున్న మంత్రి కేశవ్

ఉరవకొండ/కూడేరు, మే 31(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో పరిశ్రమలను పారదోలి, పెట్టుబడులు లేకుండా చేసి ఆర్థిక వ్యవస్థను కుప్పకూల్చారని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ విమర్శించారు. కూడేరు మండలం గొట్కూరులో శనివారం పింఛన్ల పంపిణీలో కలెక్టర్ వినోద్‌కుమార్‌తో కలిసి మంత్రి పాల్గొన్నారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము పంపిణీ చేశారు. స్థానికులు సమస్యలపై మంత్రికి వినతిపత్రం అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వం నడవడానికి ఆర్థిక ఇబ్బందులున్నా సీఎం చంద్రబాబు ప్రతి హామీనీ అమలు చేస్తున్నారని అన్నారు. త్వరలోనే అన్నదాతా సుఖీభవ, తల్లికి వందనం డబ్బులు విడుదల చేస్తామని అన్నారు. ప్రభుత్వానికి వచ్చే ఆదాయం.. జీతాలు, వడ్డీలు కట్టడానికే సరిపోతోందన్నారు. గత ప్రభుత్వం సంపదను సృష్టించకపోవడం మూలంగానే ఈ పరిస్థితి వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ కేశవనాయుడు, డీఆర్‌డీఏ పీడీ శైలజ, తహసీల్దార్ మహబూబ్ బాషా, ఎంపీడీఓ కుళ్లాయిస్వామి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బ్రహ్మయ్య పాల్గొన్నారు.

పంపిణీలో మూడో స్థానం

అనంతపురం క్లాక్‌టవర్: జిల్లాలో తొలి రోజు 2,61,875 మందికి రూ.116 కోట్ల పింఛన్ పంపిణీ చేశారు. 94.26 శాతం పంపిణీతో రాష్ట్రంలో జిల్లాను మూడో స్థానంలో నిలిపారు. డీఆర్‌డీఏ-వెలుగు ఇన్‌చార్జి పీడీ శైలజ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూం నుంచి పింఛన్ల పంపిణీని పర్యవేక్షించారు. తాడిపత్రి మున్సిపాలిటీలో అత్యధికంగా 96.73 శాతం పంపిణీ చేశారు. రాయదుర్గం మున్సిపాలిటీ 95.73 శాతంతో ద్వితీయ స్థానం, పామిడి 95.71 శాతంతో తృతీయస్థానంలో నిలిచాయి. గుంతకల్లులో అత్యల్పంగా 91 శాతం పంపిణీ జరిగింది.

విలువలతో కూడిన విద్య ముఖ్యం: ఎస్పీ



విద్యార్థికి ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ

అనంతపురం క్రైం, మే31(ఆంధ్రజ్యోతి): విలువలతో కూడిన విద్య పిల్లల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడుతుందని ఎస్పీ జగదీష్ అన్నారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం పోలీసు పిల్లల సమ్మర్ క్యాంపు-2025 ముగింపు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ.. పిల్లల భవిష్యత్తుకు ఉపయోగపడే రంగాల్లో రాణించేలా వారిని ప్రోత్సహించాలన్నారు. వేసవి సెలవుల్లో పిల్లలు ఫోన్లు, టీవీలు, ల్యాప్‌టాప్‌లతో సమయం వృథా చేయకుడా వారిలో వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించడానికి ఏటా జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నామన్నారు. ఇక్కడ నేర్చుకున్నవి వారంలో కనీసం రెండు, మూడు గంటలైనా సాధన చేయించాలని తల్లిదండ్రులను కోరారు. అనంతరం సమ్మర్ కోచింగ్ క్యాంపులో వివిధ పోటీల్లో రాణించిన విద్యార్థులను అభినందిస్తూ పతకాలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ ఇలియాజ్ బాషా, ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర్ రెడ్డి, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు గుత్తిలో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

అనంతపురం టౌన్, మే 31(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జూన్ 2న గుత్తిలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వినోద్ కుమార్ శనివారం ప్రకటనలో తెలిపారు. పత్తికొండ రోడ్డులోగల వసుధ ఫంక్షన్ హాల్‌లో కార్యక్రమం ఉంటుందన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని గుత్తి ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

ఇంకా ఓపెనే.. క్లోజ్ ఎప్పుడో..?

- సహకరిస్తున్న కొందరు పోలీసులు
- రూ.లక్షలు దండుకుంటున్న బీటర్లు
- చితికిపోతున్న పేద ప్రజలు



జోరుగా సాగుతున్న మట్కా

మట్కా మహమ్మారి పేద, మధ్య తరగతి ప్రజల జీవితాలను సర్వనాశనం చేస్తోంది. పట్టీలు రాసే బీటర్లు మాత్రం లక్షలు సంపాదిస్తున్నారు. ఈ మట్కా హిందూపురం, మడకశిర, పెనుకొండ ప్రాంతాల్లో అధికంగా సాగుతున్నట్లు సమాచారం. వివిధ కంపెనీల పేరుతో 5, 6, 7 రోజుల ఆటంటూ నిర్వాహకులు మట్కాను నడుపుతున్నారు. ఇన్నాళ్లు చెట్లకింద, పట్టణ శివారు, బస్టాండు తదితర ప్రాంతాల్లో మట్కా రాసే బీటర్లు ప్రస్తుతం సెల్‌ఫోన్, ఇంటర్నెట్ సౌకర్యంతో మట్కా నిర్వహణను కొత్త పుంతలు తొక్కిస్తున్నారు.

హిందూపురం, మే 31(ఆంధ్రజ్యోతి): హిందూపురం, మడకశిర, పెనుకొండ ప్రాంతాల్లో ఎక్కువగా చిరు వ్యాపారులు, వలస కార్మికులు, కూలీలు ఉన్నారు. వీరు పగలంతా కష్టపడి సంపాదించిన సొమ్మును సాయంత్రం అయ్యేసరికి మట్కా బీటర్లు దోచేస్తున్నారు. కూలీల వద్దకే కొంతమంది బీటర్లు వెళ్లి డబ్బులు కట్టించుకుంటున్నట్లు సమాచారం. మట్కా ఊబిలోపడి చాలా కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయి. అప్పుల భారంతో గ్రామాలు వదిలినవారుకూడా ఉన్నారు. అయితే మట్కా నియంత్రించాల్సిన పోలీసుశాఖ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. కొందరు కిందిస్థాయి సిబ్బంది మామూళ్ల మత్తులోపడి మట్కా నిర్వాహకులు, బీటర్లకు సహకరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. హిందూపురం పట్టణంలోని పరిగి బస్టాండు, చిన్నమార్కెట్, నింకంపల్లి, హౌసింగ్‌బోర్డు, శ్రీకంఠపురం, మోడల్‌కాలనీ నూతనంగా ఏర్పాటుచేసిన కూరగాయల మార్కెట్, హస్నాబాద్, చౌడేశ్వరికాలనీ, ముద్దిరెడ్డిపల్లి, కొట్నూరు ప్రాంతాల్లో అధికంగా మట్కా సాగుతున్నట్లు (మిగతా 6లో.)

ఆరు మండలాల్లో వర్షం

అనంతపురం అర్బన్, మే 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆరు మండలాల్లో శుక్రవారం రాత్రి వర్షం పడింది. అత్యధికంగా తాడిపత్రిలో 10.2 మి.మీ, వర్షపాతం నమోదైంది. యల్లనూరు 10.0, నార్పల 8.4, శింగనమల 8.0, పుట్లూరు, పెద్దవడుగూరు మండలాల్లో 2.8 మి.మీ, వర్షం కురిసింది. మిగతా ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమైనా వర్షం పడలేదు.

సీలింగ్‌ను మించి..!

- ఇష్టారాజ్యంగా ఓల్డ్ స్టేషన్ పాయింట్లు
- 8 ఏళ్ల సీలింగ్‌కు 24 పాయింట్లు ఫైనల్
- చాలామందికి 29, 39, 40 పాయింట్లు కూడా..
- మరికొందరికి రేషనలైజేషన్ పాయింట్లు సైతం
- ఎడిట్ చేయని ఎంఈఓలు, సిబ్బంది
- అర్హులకు అన్యాయం జరిగే చాన్స్..!

6

ఆర్అండ్‌బీలో క్లరికల్ సిబ్బందికి బదిలీలు

7

తప్పనిసరిగా కదల్లేదు..!

- జడ్పీ ఉద్యోగుల బదిలీల్లో మాయాజాలం

7

నా.. అనుకున్నవన్నీ
రాలిపోయాయని..
కాల గతిలో కలిసిపోయాయని..

కంటతడి పెట్టుకోకు..!
మునుముందు రోజులన్నీ..
పచ్చటి పందిళ్లు.. పండుగలే..!
నమ్ము..! ఇది కాల ధర్మం..!

(అనంతపురం నీరు ప్రగతి పార్కులో)

ధర్మం


2-4-2025

పండుటాకులు రాలిన చోట
ఎండుటాకులు ఎరువు కాగా..
మిన్ను రాల్చిన చినుకులు..
సూరీడు పంచిన కాంతులు..

వండి వార్చిన త్యాగాల పంట..
తరువుకు కరువుదీరా పత్ర సంపద..!
అవకాశాలను అందిపుచ్చుకుంటే..
పోగొట్టుకున్నచోటే వెతికి పట్టుకోవచ్చు..!

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి


30-5-2025

బుద్ధిలేని పనులు..!

అసభ్య పదజాలంతో ఆకాశరామన్న లేఖలు

సీఎం, మంత్రి సంతకాల ఫోర్జరీ..

కేసు నమోదు

సహకార శాఖలో కొందరు ఉద్యోగుల వికృత చేష్టలు



జిల్లా సహకార శాఖ అధికారి కార్యాలయం

అనంతపురం క్లాక్‌టవర్, మే 31(ఆంధ్రజ్యోతి): కొందరు ఉద్యోగుల తీరుతో సహకార శాఖ పరువు బజారున పడింది. అసభ్యకర పదజాలంతో ఒకరిపై ఒకరు ఆకాశ రామన్న లేఖలు రాయడం కలకలం రేపుతోంది. మహిళ, పురుష ఉద్యోగులపై పరస్పర లేఖలు రాసుకుంటూ ప్రభుత్వ శాఖలకు ఉన్న గౌరవాన్ని దిగజారుస్తున్నారు. సీఎం, మంత్రి సంతకాలను సైతం ఫోర్జరీ చేసి సృష్టించిన సిఫారసు లేఖలు శాఖలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. వీటిపై ఇటీవల నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో జిల్లా సహకార శాఖ అధికారి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి నెల రోజులు గడుస్తున్నా చర్యల విషయంలో ఒక్క అడుగుకూడా ముందుకు పడలేదు. ఈ లేఖలకు ఎవరు బాధ్యులనే అంశాన్ని తేల్చలేకపోతున్నారు. సహకార శాఖలో ఉద్యోగులకు చేతినిండా పని లేక అసభ్యకర పదజాలంతో పరస్పరం ఆకాశరామన్న లేఖలు రాసుకుంటూ శాఖ ప్రతిష్ఠను దిగజారుస్తున్నారనే ఆవేదన సర్వత్రా వ్యక్తం అవుతోంది. వైసీపీ పాలనలో ఈ దుష్ట సంప్రదాయం మొదలైంది. అసలు పనికి స్వస్తి పలికిన కో ఆపరేటివ్ శాఖ ఉద్యోగులు కొసరు పనుల్లో బిజీ అయ్యారు.

నష్టాలతో మూతపడుతున్న సొసైటీలు

నాబార్డు నుంచి ఆప్కాబ్, ఆప్కాబ్ నుంచి ఏడీసీసీ బ్యాంకు, బ్యాంకు నుంచి సొసైటీలకు, సొసైటీల నుంచి రైతులకు రుణాలు ఇస్తారు. ఇచ్చిన రుణాలు ప్రతి ఏటా సక్రమంగా రైతులు రెన్యువల్ చేసుకునేలా, లావాదేవీలు సక్రమంగా నిర్వహించేలా చూడాల్సిన బాధ్యత బ్యాంకు, సొసైటీ ఉద్యోగులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాల్సిన సహకార శాఖ అధికారులు తమకేమీ సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఉమ్మడి జిల్లాలో ఉన్న 108సొసైటీల్లో 70కి పైగా సొసైటీలు సిబ్బందికి జీతాలు కూడా చెల్లించలేని దుస్థితిలో ఉండిపోయాయి. జిల్లా కేంద్రానికి అతి సమీపంలో ఉన్న కూడేరు సొసైటీలో లావాదేవీలు నిలిపివేయడం, సిబ్బందికి జీతాలు ఇవ్వలేక మూతపడింది. ఉమ్మడి జిల్లాలో సుమారు 30సొసైటీలు కోలుకోలేని నష్టాల్లో కూరుకుపోయాయి. ఇలాంటి పరిస్థితుల్లో సొసైటీలను బలోపేతం చేయడం విస్మరించిన సహకార శాఖ అధికారులు కొసరు పనుల్లో నిమగ్నమవ్వడం విమర్శలకు దారితీస్తోంది.

చుట్టపు చూపుగా మారిన పీఐసీ

గతేడాదిగా ఏడీసీసీ బ్యాంకు, డీసీఎంఎస్‌లకు పాలకవర్గాలు లేవు. జిల్లా జాయింట్ కలెక్టర్‌ను బ్యాంకుతోపాటు డీసీఎంఎస్‌లకు పర్సన్ ఇన్‌చార్జిగా (పీఐసీ)గా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. సహకార శాఖ అధికారులను సమన్వయం చేసుకుని ఏడీసీసీ బ్యాంకు, డీసీఎంఎస్ పరిధిలోని సొసైటీలను బలోపేతం చేయడానికి పీఐసీ కీలకపాత్ర వహించాలి. అయితే ఏడాది కాలంలో పీఐసీ కేవలం అరకొర సమావేశాలతోనే గడిపారు. ఆత్మకూరు బ్రాంచ్ పరిధిలో నకిలీ పట్టాలకు సుమారు రూ.20లక్షల రుణాలు చెల్లించిన ఘటనలో విచారణ అధికారి నివేదిక ఇచ్చి 20రోజులు గడుస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. సొసైటీల అభివృద్ధిలో పీఐసీ పాత్ర, పర్యవేక్షణే ప్రధానం. అయితే ఇందుకు భిన్నంగా వ్యవహారం నడుస్తోంది.

ఆ బాధ్యత ఉద్యోగులదే...



సహకార సొసైటీలను, వ్యవస్థను బలోపేతం చేసి గ్రామీణ ప్రాంతాల్లో పేదలు, రైతులకు సేవలందించాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉంది. ఎవరికి కేటాయించిన విధులను వారు సమర్థవంతంగా నిర్వహించి సొసైటీలను అభివృద్ధి చేయాలి. కంప్యూటరైజేషన్ పూర్తయిన సొసైటీలను నష్టాల నుంచి లాభాల బాటలోకి తేచ్చే ప్రయత్నాలు ముమ్మరంగా జరగాలి. లావాదేవీలు అన్నీ ఆన్‌లైన్‌లోనే జరగాలి. డిపార్ట్‌మెంట్‌లో జరుగుతున్న అసభ్యకర పదజాలంతో కూడిన ఆకాశరామన్న లేఖలు, సంతకాల ఫోర్జరీలపై పోలీసులకు ఫిర్యాదు చేశాం. ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. నిజాలను నిగ్గు తేల్చాల్సిన బాధ్యత పోలీసులదే.

-అరుణకుమారి, జిల్లా సహకార శాఖ అధికారి (డీసీఓ)

ఇంకా ఓపెనే.. క్లోజ్ ఎప్పుడో..?

(5వ పేజీ తరువాయి)

తెలుస్తుంది. అలాగే పెనుకొండ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు, అనంతపురం వెళ్లే రహదారిలో ఉన్న కొన్ని బంకుల్లో, కోటకు ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో మట్కా బీటర్లు కొంతమంది పట్టీలు రాస్తున్నట్లు తెలిసింది. మడకశిరలో కొంతమంది పోలీస్ సిబ్బంది మట్కాకు సహకరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. హిందూపురం పరిధిలో లేపాక్షి, చిలమత్తూరు మండలాల్లో కూడా మట్కా సాగుతున్నట్లు సమాచారం. ముఖ్యంగా సోమందేపల్లి, గోరంట్ల, పరిగిలో కూడా చాపకింద నీరులా మట్కా విస్తరించింది.

సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు

ప్రస్తుతం చాలా మంది బీటర్లు సెల్‌ఫోన్, ఇంటర్నెట్ ద్వారా మట్కా నిర్వహిస్తున్నారు. మరికొంతమందైతే యాప్‌లు రూపొందించి అందులోనే మట్కా ఆడుతూ చెల్లింపులు కూడా చేస్తున్నట్లు తెలిసింది. వాణిజ్యకేంద్రంగా పేరుగాంచిన హిందూపురం ప్రాంతంలో సాంకేతిక పరిజ్ఞానంతో యాప్‌లు రూపొందించి ఎక్కువగా మట్కా ఆడుతున్నట్లు సమాచారం. ఒకప్పుడు మట్కా పట్టీలు బీటర్లురాసి దానిని నిర్వాహకుల కేంద్రం వరకు తీసుకెళ్లేవారు. అలాగే మరుసటి రోజు ఉదయం ఒక వేళ ఎవరికైనా నంబరు తగిలితే అక్కడికి వెళ్లి డబ్బులు తీసుకొచ్చి ఇచ్చేవారు. కానీ ప్రస్తుతం ఆన్‌లైన్ లావాదేవీలు కావడంతో బీటరు ఇంటి నుంచే పంపే సౌకర్యం అందుబాటులో ఉంది. దీనివల్ల కొంతమంది మట్కా బీటర్లను గుర్తించేందుకు పోలీసులకు ఇబ్బంది ఎదురవుతోంది.

నిర్మూలనకు ప్రత్యేక చర్యలు

మట్కా నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలకు కూడా దీనిపై ఇప్పటికే అవగాహన కల్పిస్తున్నాం. సైబర్ క్రైమ్ సహకారంతో ఆన్‌లైన్ మట్కా యాప్‌లపై కూడా దృష్టిసారిస్తాం. పేద, మధ్యతరగతి కుటుంబాలు మట్కాకు అలవాటుపడితే జరిగే నష్టాలు తెలుసుకుని వ్యసనానికి దూరంగా ఉండాలి. మట్కా నిర్వాహకులు, బీటర్లకు మా సిబ్బంది సహకారం ఉన్నట్లు తేలితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. -మహేష్, డీఎస్పీ

పర్యావరణంపై విద్యార్థులకు పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, మే 31(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు మూడు అంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు ఏపీ కాలుష్య నియంత్రణ మండలి అధికారి బీవై మునిప్రసాద్ శనివారం ప్రకటనలో తెలిపారు. 'భూమిని రక్షించడంలో నేను ఎలా సహాయపడగలను' అనే అంశంపై 2న సైన్స్ సెంటర్‌లో, 3న ఆర్ట్స్ కాలేజీ, 4న ఎస్కే యూనివర్సిటీ సమీపంలోని రైపర్ కళాశాలలో వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు ఉంటాయన్నారు. వివరాలకు 9866776728 నంబరులో సంప్రదించాలని కోరారు.

సీలింగ్‌ను మించి..!

- ఇష్టారాజ్యంగా ఓల్డ్ స్టేషన్ పాయింట్లు
- 8 ఏళ్ల సీలింగ్‌కు 24 పాయింట్లు ఫైనల్
- చాలామందికి 29, 39, 40 పాయింట్లు కూడా..
- మరికొందరికి రేషనలైజేషన్ పాయింట్లు సైతం
- ఎడిట్ చేయని ఎంఈఓలు
- అర్హులకు అన్యాయం జరిగే చాన్స్..!

అనంతపురం విద్య, మే 31(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ బదిలీల్లో ఓల్డ్‌స్టేషన్ పాయింట్లు ఇష్టారాజ్యం వేసుకున్నారు. ఒక స్టేషన్‌లో 8 ఏళ్లకు మించి ఎన్ని సంవత్సరాలు పనిచేసినా... 24 పాయింట్లు ఇవ్వడమే ఫైనల్. 9 ఏళ్లు, 10 ఏళ్లు పనిచేసినా... 8 ఏళ్లకు ఏడాదికి 3 పాయింట్లు చొప్పున 24 పాయింట్లు మాత్రమే వేయాలి. 8 ఏళ్లకు సీలింగ్ పెట్టారు కాబట్టి... ఏ లాంగ్ స్టాండ్ టీచర్‌కు అయినా ఓల్డ్‌స్టేషన్ 24 పాయింట్లు మాత్రమే వేయాలి. కొందరికి 29.0517, మరి కొందరికి 39, ఇంకొందరికి 40 పాయింట్లు కూడా వేశారు. శనివారం విడుదలైన ఎస్‌జీటీల ప్రొవిజినల్ సీనియారిటీ జాబితాలో ఈ డొల్లతనం బట్టబయలైంది. ఎన్ని పాయింట్లు పడినా... సీలింగ్ నిబంధనకు 24కి కుదించేలా విద్యాశాఖ.. ఎంఈఓలకు అధికారం ఇచ్చింది. ఎంఈఓల నిర్లక్ష్యంతో కిందిస్థాయి సిబ్బందికి వదిలేయడం వల్ల ఎడాపెడా కొట్టేయడంతో ఓల్డ్ స్టేషన్ పాయింట్లు భారీగా వచ్చాయి. దీని వల్ల అర్హులైన సీనియర్ టీచర్లకు అన్యాయం వాటిల్లే ప్రమాదం ఉంది.

వందలాది మందికి ఇలాగే పాయింట్లు...

ఉమ్మడి అనంతపురం జిల్లాలో వందలాది మంది టీచర్లకు ఇలాగే పాయింట్లు పడ్డాయి. తనకల్లు మండలంలో పనిచేసే ఇద్దరు టీచర్లకు 39.051 పాయింట్లు వేశారు. పెనుకొండ డివిజన్‌లో మరో ఇద్దరికి 39, బుక్కరాయసముద్రంలో ఒకరికి 30, తనకల్లు మండలంలోని మరో స్కూల్‌లో పనిచేసే టీచర్‌కు 40, పెద్దపప్పూరు మండలంలో ఓ లేడీ టీచర్‌కు 29.0517 పాయింట్లు పడ్డాయి. ఇలా వందలాది మంది ఎస్‌జీటీలకు 24 పాయింట్లకు అదనంగా ఓల్డ్ స్టేషన్ పాయింట్లు పడటం విమర్శలకు తావిస్తోంది. జిల్లాలో బీకేఎస్, కూడేరు, బెలుగుప్ప, పెద్దపప్పూరు, బత్తలపల్లి, విడపనకల్లు, ముదిగుబ్బ, ధర్మవరం, పుట్టపర్తి, కదిరి, హిందూపురం, తాడిపత్రి, యాడికి, లేపాక్షి, కుందుర్పి, శింగనమల మండలాల్లో చాలా ఉన్నట్లు స్పష్టమవుతోంది. కొందరు టీచర్లకు ఓల్ట్ స్టేషన్ పాయింట్లతోపాటు రేషనలైజేషన్ పాయింట్లు కూడా పడ్డాయి. దీంతో 40 పాయింట్లు కూడా దాటిన టీచర్లు కుప్పలు..తెప్పలుగా ఉన్నారు. తద్వారా సీనియర్ల కంటే జూనియర్లకు అధికంగా పాయింట్లు రావడంతో సీనియారిటీలో ముందుకు చేరారు. ఫలితంగా సీనియర్లకు అన్యాయం జరుగుతోంది.

ఎంఈఓల నిర్లక్ష్యం

ఉపాధ్యాయుల ఆన్‌లైన్ దరఖాస్తుల ఎడిట్‌కు విద్యాశాఖ గతంలో అవకాశం ఇచ్చింది. ఎవరైనా టీచర్ ఓల్డ్ స్టేషన్ పాయింట్లు ఎక్కువగా వేసుకున్నా... టెక్నికల్ సమస్య కారణంగా అధికంగా యాడ్ అయినా... వెంటనే ఎంఈఓలు సరిచేయడానికి అవకాశం ఉంది. ఎంఈఓలు పట్టించుకోకపోవడంతోపాటు, కొందరు టీచర్లు సైతం తమకు అదనంగా వచ్చిన పాయింట్లను చూసుకుని తమకే మేలు అంటూ అలాగే ఉండటం వల్ల చాలా మందికి 24 పాయింట్ల కంటే ఎక్కువగా పడ్డాయి. ఎడిట్ అవకాశం ఉన్నా... మండల విద్యాశాఖాధికారులు ప్రేక్షకపాత్ర పోషించడం విమర్శలకు తావిస్తోంది. వందలాదిమందికి సీలింగ్ పాయింట్ల కంటే ఇలా అదనంగా ఓల్డ్ స్టేషన్ పాయింట్లు పడటంతో అర్హులు, సీనియర్లకు అన్యాయం జరుగుతోంది. డీఈఓ దీనిపై దృష్టి సారించకుంటే చాలామంది సీనియర్లు నష్టపోయే ప్రమాదం ఉంది.

ఆశల ఆకాశం..

(5వ పేజీ తరువాయి)

ఆముదం 16,293, వరి 19,466, జొన్న 1,719, సజ్జ 2,054, మొక్కజొన్న 14,653, రాగి 69, కొర్ర 3,311, పెసలు 455 హెక్టార్లు, మిగతా విస్తీర్ణంలో ఉలవలు, మినుములు, అలసంద తదితర రకాల పంటలుసాగవనున్నాయి.


గుత్తి రూరల్ మండలం గొందిపల్లిలో సిద్ధం చేసుకున్న వేరుశనగ విత్తనాలు

80 శాతం దుక్కులు పూర్తి

ఈసారి మే నెలలో కురిసిన వర్షాలకు జిల్లాలోని మెట్టభూముల్లో 80 శాతం దాకా దుక్కులు పూర్తయ్యాయి. దుక్కులు దున్నుకున్న తర్వాత వర్షం పడితే నేరుగా విత్తనం వేసుకునేందుకు అనుకూలం. దుక్కులు చేసుకున్న ప్రాంతాల్లో మరోమారు వర్షం పడితే విత్తనం వేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. ఖరీఫ్ సీజన్‌లో జూన్ 15 నుంచి జూలై 15 వరకు వేరుశనగ విత్తనం విత్తుకునేందుకు అదును సమయంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఆ సమయంలో విత్తనం వేసుకుంటే దిగుబడులు బాగుంటాయని స్పష్టం చేస్తున్నారు. జూన్ 8వ తేదీ మృగశిర కార్తె ప్రారంభం కానుంది. ఇప్పటికే కొందరు రైతులు బహిరంగ మార్కెట్‌లో విత్తన వేరుశనగను కొనుగోలు చేసుకోగా.. మరికొందరు సబ్సిడీ విత్తన కాయల కోసం ఎదురుచూస్తున్నారు.

ముందస్తుగానే నైరుతి ప్రవేశం

జిల్లాలోకి ఈ ఏడాది మే 26వ తేదీ ఉదయం నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి. గత ఏడాదితో పోలిస్తే ముందస్తుగానే ఈసారి వచ్చాయి. గతేడాది మే 29వ తేదీ కేరళకు... జూన్ 2న జిల్లాలోకి ప్రవేశించాయి. ఈ ఏడాది మే 24న కేరళకు... 26న జిల్లాలోకి ప్రవేశించాయి. నైరుతి రుతుపవనాల ప్రవేశం తర్వాత కొన్ని ప్రాంతాల్లో చిరుజల్లుల నుంచి ఓ మోస్తరు వర్షం పడింది. మరోసారి పదును వర్షం పడితే విత్తనం వేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు.

సబ్సిడీ విత్తనం కోసం..

ఈ ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి 54,184 క్వింటాళ్ల సబ్సిడీ విత్తనాలను కేటాయించారు. ఇందులో వేరుశనగ 50,592, వరి 800, మినుములు 36, పెసలు 60, కంది 2380, అలసంద 60, రాగి 4, కొర్ర 45, జీలుగ 190, జనుము 2, పిల్లిపెసర 15 క్వింటాళ్లను కేటాయించారు. బహిరంగ మార్కెట్‌లో కే-6 విత్తనాలు క్వింటాల్ రూ.11,500, ఎత్తు ట్యాగ్ రకం రూ.12వేలకు విక్రయిస్తున్నారు. ఒంగోలు, నెల్లూరు జిల్లాల నుంచి ఎత్తు ట్యాగ్ రకం విత్తన వేరుశనగ కాయలను వ్యాపారులు గుత్తి, ఇతర ప్రాంతాలకు తీసుకొచ్చి, అక్కడే మిషన్‌లో ఆడించి రైతులకు విక్రయిస్తున్నారు. ఎక్కువ విస్తీర్ణం భూమి కలిగిన రైతులు బహిరంగ మార్కెట్‌లోనే విత్తన వేరుశనగ కొనుగోలు చేస్తున్నారు. తక్కువ విస్తీర్ణం ఉన్నవారు సబ్సిడీ విత్తనం కోసం ఎదురుచూస్తున్నారు. రెండ్రోజులుగా రైతు సేవాకేంద్రాల్లో సబ్సిడీ విత్తన వేరుశనగ కావాల్సిన రైతులతో రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారు. ఇప్పటిదాకా 920 మంది రైతులు 811 క్వింటాళ్ల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. జిల్లాలోని 21 మండలాల పరిధిలో 167 ఆర్ఎస్‌కేలకు 17,180 క్వింటాళ్ల విత్తన వేరుశనగ కాయలు సరఫరా చేశారు. ఈ పరిస్థితుల్లో ఎప్పటినుంచి విత్తన పంపిణీ ప్రారంభిస్తారో ఇంకా స్పష్టమైన సమాచారాన్ని వ్యవసాయ అధికారులు ఇవ్వలేకపోతున్నారు. విత్తనకాయల ప్రాసెసింగ్‌ను మరింత వేగవంతం చేసి, సరఫరా చేస్తేనే సకాలంలో విత్తన పంపిణీ మొదలు పెట్టే అవకాశం ఉంటుంది. లేదంటే మరింత ఆలస్యమయ్యే ప్రమాదం ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

పదును వర్షం పడితే విత్తేస్తాం



ఇటీవల కురిసిన వర్షాలకు ఐదెకరాల్లో సేద్యం పనులు చేశా. ఈసారి సబ్సిడీ విత్తనం పంపిణీ ఆలస్యమయ్యే అవకాశం ఉండటంతో బహిరంగ మార్కెట్‌లోనే కొనుగోలు చేశా. విత్తనాన్ని సిద్ధం చేసుకున్నాం. పదును వర్షం పడితే జూన్ 8న ప్రారంభమయ్యే మృగశిర కార్తెలో విత్తేస్తా. సకాలంలో వర్షాలు పడితే ఈసారైనా పంట పడుతుందని ఆశలు పెట్టుకున్నాం.

- రైతు శ్రీనివాస్ చౌదరి, ధర్మాపురం, గుత్తి రూరల్ మండలం

ఎదురుచూస్తున్నా..



ఇటీవల పడిన వర్షాలకు ఏడెకరాల్లో సేద్యం పనులు చేసుకున్నా. సబ్సిడీ విత్తనం కోసం ఎదురుచూస్తున్నా. గతేడాది ఈపాటికే సబ్సిడీ విత్తనకాయలు పంపిణీ చేశారు. ఈసారి ఇంకా రిజిస్ట్రేషన్ మొదలు పెట్టారు. ఎప్పటి నుంచి పంపిణీ చేస్తారో కచ్చితంగా ఎవరూ చెప్పలేకపోతున్నారు. పదును వర్షం వస్తే మిగతా రైతులతోపాటే మృగశిర కార్తెలోనే విత్తనం వేయాలనుకుంటున్నా. దీనిని దృష్టిలో ఉంచుకుని, త్వరగా సబ్సిడీ విత్తన కాయలు పంపిణీ చేస్తే బాగుంటుంది.


- రైతు భాస్కర్, ఊబిచెర్ల, గుత్తి రూరల్ మండలం

శరవేగంగా..

హెచ్చెల్సీ లైనింగ్, బ్రిడ్జి పనులు


115వ కిలోమీటరు వద్ద చేపట్టిన లైనింగ్ పనులు

బొమ్మనహాళ్, మే 31(ఆంధ్రజ్యోతి): జిల్లాకి జీవనాడి అయిన తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ) మరమ్మతు పనులు శరవేగంగా సాగుతున్నాయి. తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో వస్తుండడంతో పనుల్లో వేగం పెంచారు. కాలువను గత పాలకులు నిర్వీర్యం చేశారు. కనీసం మరమ్మతులు కూడా చేయలేదు. కాలువ గట్టు బలహీనపడడంతో నీరు కూడా తక్కువగానే తీసుకున్నారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరాక సాగు, తాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టింది. దీంతో హెచ్చెల్సీకి పూర్వ వైభవం తీసుకువస్తున్నారు. టెండర్ల ద్వారా నిధులు కేటాయించి సాగునీటి కాలువ పనులకు శ్రీకారం చుట్టారు. రూ.28.05 కోట్లతో 11 పనులు చేపడుతున్నారు. నీటి ప్రవాహానికి ఇబ్బందిగా ఉన్న ప్రాంతాల్లో మరమ్మతులు చేసేందుకు టెండర్లు పిలిచి, పనులు చేస్తున్నారు. నాగలాపురం, మల్లికేతి, ఉద్దేహళ్, దర్గాహొన్నూరు గ్రామాల వద్ద బ్రిడ్జిలు, 115 నుంచి 130వ కిలోమీటరు పరిధిలో లైనింగ్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఎగువ కాలువకు తుంగభద్ర జలశయం నుంచి నీరు విడుదలైన తర్వాత రైతాంగానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆయకట్టుకు సాగునీరు ఇచ్చేలా పనులు కొనసాగుతున్నాయి.


నాగలాపురం వద్ద బ్రిడ్జి పనులు

పొగాకు ఆరోగ్యానికి హానికరం

డీఎంహెచ్ఓ డాక్టరు ఈబీదేవి

అనంతపురం టౌన్, మే 31(ఆంధ్రజ్యోతి): పొగాకు వాడకం ఆరోగ్యానికి హానికరమని జిల్లా వైద్యాధికారి డాక్టరు ఈబీదేవి సూచించారు. పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శనివారం జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో స్థానిక డీఎంహెచ్ఓ కార్యాలయం వద్ద నుంచి ర్యాలీ ప్రారంభించారు. ఇది తెలుగుతల్లి విగ్రహం వరకు కొనసాగింది. ప్రజలకు పొగాకు వల్ల కలిగే అనర్థాలు గురించి అవగాహన కల్పిస్తూ వివిధ రకాల ప్లేకార్డులు ర్యాలీలో ప్రదర్శించారు. ఈసందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ పొగాకు ఏరూపంలో వాడినా మనిషి ఆరోగ్యానికి హాని కలిగిస్తుందన్నారు. పొగాకు వాడకంపై ప్రభుత్వం నిషేధిత చట్టాలను తీసుకొచ్చిందన్నారు. విద్యాసంస్థల సమీపంలో పొగాకు సంబంధిత బీడీ, సిగరెట్లు అమ్మకాలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఓ గిరిజామనోహర్, మలేరియా అధికారి డాక్టరు ఓబులు, డెమోలు త్యాగరాజు, గంగాధర్, ఎన్‌హెచ్ఎం కిషోర్, ఫణి, సోషల్‌వర్కర్ శ్రీరాములు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీ కొనసాగిస్తున్న డీఎంహెచ్ఓ, ఇతరవైద్యులు,సిబ్బంది



ర్యాలీ చేపడుతున్న ప్రిన్సిపాల్,సూపరింటెండెంట్, డాక్టర్లు, మెడికోలు

పొగాకుతో జాగ్రత్త: ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్

కేన్సర్ కారకం పొగాకు పట్ల జాగ్రత్త వహించాలని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ మాణిక్యాలరావు, సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. కళాశాలలో డాక్టర్లు, మెడికోలతో కలిసి శనివారం పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పొగాకు వాడకం ఆరోగ్యాన్ని పాడు చేస్తుందన్నారు. అందుకే ఎవరూ పొగాకు ఉత్పత్తుల జోలికి వెళ్లకండని సూచించారు. పొగాకుకు వ్యతిరేకంగా ఉంటామని మెడికోలతో ప్రతిజ్ఞ చేయించారు.

అండర్-23 జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక


ఎంపికైన జిల్లా అండర్-23 క్రికెట్ జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, మే 31(ఆంధ్రజ్యోతి): జిల్లా అండర్-23 పురుషుల క్రికెట్ వన్డే జట్టును ఎంపిక చేశారు. వివరాలను శనివారం స్థానిక అనంత క్రీడాగ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పీఎల్ ప్రకాష్‌రెడ్డి, భీమలింగా రెడ్డి ప్రకటించారు. పి. అర్జున్ టెండూల్కర్ (కెప్టెన్), ఎంకె దత్తారెడ్డి (వికెట్ కీపర్), కేహెచ్ వీరారెడ్డి, మహేంద్రరెడ్డి, జయంత్ కృష్ణ, భానుప్రకాష్, వికాస్, మనోజ్‌కుమార్, ఎంకె లోహిత్‌సాయి కిషోర్, మల్లికార్జున, కమిల్, దీపక్, నిశ్చయ్, ప్రదీప్‌రెడ్డి, లీలసాయి, ప్రశాంత్ ఎంపికయ్యారు. స్టాండ్‌బైలుగా ఎం జైకృష్ణ, కె వెంకట్‌లోకేష్, పి. మణిదీప్, కె ప్రమోద్, వి. ప్రవీణ్, సిహెచ్ భార్గవ్‌రాజు స్థానం సంపాదించారు. కోచ్‌గా శర్మాస్‌వలి నియమితులయ్యారు. ఆదివారం నుంచి కడపలో జరిగే ఏసీఏ అండర్-23 వన్డే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఈ జట్టు పాల్గొంటుంది.

జనహోబిలం


ప్రత్యేక అలంకరణలో స్వామివారి మూల విరాట్

ఉరవకొండ, మే31(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి, స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలో స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సాయంత్రం పల్లకీ సేవ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవమూర్తులను పల్లకిలో కొలువుదీర్చి మేళతాళాల మధ్య ఆలయం చుట్టూ ఊరేగించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.


దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు

క్రైం కార్నర్

కర్ణాటక బస్సు, కారు ఢీ

● వృద్ధుడి మృతి, నలుగురికి గాయాలు



బస్సు కింద ఇరుక్కుపోయిన కారు

ఉరవకొండ, మే31(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదగవి గ్రామ సమీపాన శనివారం కేఎస్ఆర్టీసీ బస్సు, కారు ఢీకొన్న ప్రమాదంలో జాన్‌రెడ్డి (80) అనే వృద్ధుడు మృతి చెందగా.. మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ధర్మవరానికి చెందిన జాన్ రెడ్డి కుటుంబసభ్యులు హంపికి వెళ్లి, కారులో తిరుగు ప్రయాణమయ్యారు. బూదగవి సమీపాన అనంతపురం నుంచి గంగావతికి వెళ్తున్న కేఎస్ఆర్టీసీ బస్సు కారును ఢీకొంది. బస్సు కింద కారు ఇరుక్కుపోయింది. కారులో ప్రయాణిస్తున్న జాన్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి భార్య చిన్నమ్మ, కుమార్తె సైనీదీప్తి, మనవడు రోహన్‌తోపాటు డ్రైవర్ వెంకటరమణ తీవ్రంగా గాయపడ్డారు. వారిని హుటాహుటిన ఉరవకొండ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురం వెళ్లాలని వైద్యులు సూచించారు. ప్రమాద స్థలాన్ని సీఐ మహానంది పరిశీలించారు. జాన్‌రెడ్డి మృతదేహాన్ని ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

మళ్లీ అదే సీన్

● ఫయాజ్ ఇంటి కొలతలకు వెళ్లిన అధికారులు
● కొందరిని లోపలికి పంపడానికి అభ్యంతరం



ఇంటిని కొలుస్తున్న అధికారులు

తాడిపత్రి, మే 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చిన్నబజారులో ఉన్న వైసీపీ కౌన్సిలర్ ఫయాజ్‌బాషా కొత్త ఇంటికి సంబంధించి కొలతల విషయంలో అధికారులతో శనివారం వాగ్వాదం జరిగింది. ఫయాజ్‌బాషా మున్సిపల్ స్థలాన్ని కొంత ఆక్రమించి కొత్తగా ఇంటిని నిర్మించాడని మున్సిపల్ అధికారులు గతంలో ఆయన ఇంటివద్దకు వెళ్లారు. విషయం కోర్టులో నడుస్తోందని ఫయాజ్‌బాషా మున్సిపల్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఇదేక్రమంలోనే మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, మున్సిపల్ అధికారులు ఎన్‌క్రోచ్‌మెంట్‌లో ఉన్న ఫయాజ్ ఇంటి నిర్మాణాలను తొలగించాలని ఎక్స్‌కవేటర్ తీసుకువెళ్లిన విషయం తెలిసిందే. ఈ విషయంగా వైసీపీ, టీడీపీ వర్గాల మధ్య రాళ్ల దాడులు జరిగాయి. దీంతో జిల్లా అధికారులు కొలతల విషయంగా ఒక కమిటీని నియమించారు. ఆ కమిటీ 20రోజుల కిందట ఫయాజ్‌బాషా ఇంటివద్దకు వెళ్లగా ఎవరూ లేకపోవడంతో వెనుదిరిగి వెళ్లిపోయారు. మళ్లీ శనివారం ఇంటి కొలతలకు కమిటీ సభ్యులు వెళ్లగా, కొంతమంది లోపలకు రాకూడదని ఫయాజ్ అభ్యంతరం తెలిపాడు. దీంతో కొంత వాగ్వాదం జరిగింది. తహసీల్దార్ రజాక్‌వలి జోక్యం చేసుకొని కమిటీలో సభ్యులు మాత్రమే లోపలికి వెళతామని చెప్పారు. అధికారులు మాత్రమే వెళ్లాలని కౌన్సిలర్లకు ఏమి సంబంధమని వారిని వెళ్లనిచ్చేది లేదని ఫయాజ్‌బాషా వాగ్వాదానికి దిగారు. దీంతో అధికారులను మాత్రమే లోపలికి పంపించి కొలతలు జరిగేటట్లు చూశారు.

చీనీ టన్ను రూ. 30వేలు

అనంతపురం రూరల్, మే 31(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 30వేలు పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 3వేలు, సరాసరి రూ. 18వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 508 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

ప్రగతి రైలు కోచ్ రెస్టారెంట్ పరిశీలన



డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తాకు స్వాగతం పలుకుతున్న అధికారులు..

అనంతపురం న్యూటౌన్, మే 31(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రగతి రైలు కోచ్ రెస్టారెంట్‌ను డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా శనివారం పరిశీలించారు. రెస్టారెంట్ డైరెక్టర్ ఆనంద్ ఆయనకు స్వాగతం పలికారు. గుంతకల్లు డివిజన్ పరిధిలో రెండో రైల్వే కోచ్ రెస్టారెంట్‌ను అనంతపురంలో ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని డీఆర్ఎం అన్నారు. రైల్వే ప్రయాణికులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించడంలో భాగంగా, పాత రైల్‌కోచ్‌లతో ప్రయాణికులకు అన్ని సౌకర్యాలు ఉండేలా రెస్టారెంట్ అందుబాటులోకి తెచ్చామని అన్నారు.

ఉద్యమ్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

● పరిశ్రమల శాఖ జీఎం శ్రీనివాస యాదవ్

అనంతపురం అర్బన్, మే 31(ఆంధ్రజ్యోతి): పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు తప్పనిసరిగా ఉద్యమ్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పరిశ్రమల శాఖ జీఎం శ్రీనివాస యాదవ్ సూచించారు. స్థానిక పరిశ్రమల శాఖ జీఎం కార్యాలయంలో శనివారం వ్యాపారులు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ఉద్యమ్ రిజిస్ట్రేషన్ ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జీఎం మాట్లాడుతూ... ఉద్యమ్ రిజిస్ట్రేషన్ ఉంటేనే బ్యాంకర్లు రుణాలు మంజూరు చేస్తారన్నారు. బిజినెస్ చేయాలనుకునే వారు ముందస్తుగానే ఉద్యమ్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. దీనిపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీ రాజశేఖర్‌రెడ్డి, ఐపీఓ రవీంద్రనాథ్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ చలపతి, సిబ్బంది పాల్గొన్నారు.

గోదాముల్లోనే... పప్పుశనగ..!

● గిట్టుబాటు ధరలేక పెరిగిన నిల్వలు
● తక్కువ ధరకే కొందరు రైతులు విక్రయం
● ధర పెరుగుతుందన్న ఆశలో చాలామంది..



గోదాములో నిల్వ ఉంచిన పప్పుశనగ పంట

అనంతపురం అర్బన్/బెళుగుప్ప, మే 31(ఆంధ్రజ్యోతి): ఆశించిన ధరలు రాకపోవడంతో రైతులు నిల్వచేసిన పప్పుశనగ గోదాముల్లోనే మూలుగుతోంది. గిట్టుబాటు ధర లేకపోవడంతో రెండేళ్లుగా పప్పుశనగను గోదాముల్లో నిల్వ చేసుకున్నారు. గత ఏడాది రబీ పంటను ఎక్కువ మంది మంది రైతులు నిల్వ చేసుకున్నారు. డబ్బులు అత్యవసరమైన రైతులు బయట వ్యాపారులకు అమ్మేశారు. మరికొందరు ధరలు పెరుగుతాయన్న ఆశతో ఎదురు చూస్తున్నారు. ఈ రబీసీజన్‌లో కొత్త పంట కూడా జత కావడంతో గోదాముల్లో నిల్వలు పెరిగిపోయాయి. గత ఏడాది రబీలో సాగు చేసిన పప్పుశనగ పంట కోతలు ఈ ఏడాది ఫిబ్రవరిలో పూర్తయ్యాయి. అప్పట్లో పప్పుశనగ నాణ్యత ఆధారంగా క్వింటా ధర రూ.5వేల నుంచి రూ.5,500 దాకా పలికింది. పంట కోతలు పూర్తయి మూడు మాసాలు గడుస్తున్నా ధరలో పెద్దగా మార్పు కనిపించలేదు. రబీ సీజన్ ఆరంభంలో విత్తనం వేసేందుకు క్వింటా పప్పుశనగ రూ.7వేల నుంచి రూ.8వేలతో కొనుగోలు చేశారు. గత ఏడాది ఎకరాకు 4 క్వింటాళ్లలోపు దిగుబడి వచ్చింది. పంట సాగు కోసం రూ.20 వేల దాకా పెట్టుబడి పెట్టారు. ప్రస్తుతం క్వింటా రూ.5,800 పలుకుతోంది. కష్టపడి పంట పండించిన తర్వాత కొనుగోలు చేసిన ధర కూడా లభించకపోవడంతో ఏం చేయాలో తోచని అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు. 2023-24 సంవత్సరంలో పంట కోత సమయంలో క్వింటా రూ.5500 పలికింది. తర్వాత కొన్ని నెలలకు క్వింటా పప్పుశనగ రూ.6వేల నుంచి రూ.6500 పెరిగింది. కొన్నేళ్ల క్రితం క్వింటా రూ.10వేలకు పైగానే పలికింది. తర్వాత ప్రతి ఏడాది ధర తగ్గుతూ వస్తోంది. దళారులు కుమ్మక్కై ధరలు తగ్గిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెండేళ్లుగా గోదాముల్లోనే...

ఆశించిన స్థాయిలో పప్పుశనగ ధరలు లేకపోవడంతో గత రెండేళ్లుగా ఎక్కువ శాతం పప్పుశనగ పంట ఉత్పత్తులు గోదాముల్లో నిల్వ చేసుకున్నారు. బెళుగుప్ప మండలంలో ఐదు గోదాములు ఉన్నాయి. రెండేళ్ల నుంచి పప్పుశనగ పంట ఉత్పత్తులు నిల్వ చేసుకున్నారు. ప్రస్తుతం ఒక్కో గోదాములో 5వేల మెట్రిక్ టన్నుల పప్పుశనగ నిల్వ ఉన్నట్లు గోదాముల నిర్వాహకులు చెబుతున్నారు. విడపనకల్లులోని గోదాములో 800 క్వింటాళ్ల పప్పుశనగ నిల్వ ఉంది. మిగతా ప్రాంతాల్లోని గోదాముల్లో ఇదే స్థాయిలో నిల్వలు ఉన్నట్లు సమాచారం.

భారమవుతున్న బాడుగలు

గోదాముల్లో నిల్వచేసుకున్న పప్పుశనగకు బాడుగలు చెల్లించడం రైతులకు భారమవుతున్నాయి. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రైవేటు శీతల గిడ్డంగులు ఉన్నాయి. ఉరవకొండ, బెళుగుప్ప, విడపనకల్లు, పుట్లూరు, తాడిపత్రి, కణేకల్లు తదితర మండలాల్లో ప్రైవేటు వ్యక్తులు శీతల గిడ్డంలు ఏర్పాటు చేశారు. బెళుగుప్ప మండలంలోని గోదాముల్లో ఆరు నెలలకు క్వింటాకు రూ.రూ.60 నుంచి 70 వరకు బాడుగ వసూలు చేస్తున్నారు. ఏడో నెల నుంచి క్వింటాపై నెలకు రూ.10 అదనంగా బాడులు చెల్లించేలా నిర్ణయం తీసుకున్నారు. విడపనకల్లులో క్వింటాలు పప్పుశనగకు ఏడాదికి రూ.150, ఉరవకొండలో ఏడాదిలోపు వరకు క్వింటాలుకు రూ.100 వసూలు చేస్తున్నారు. పుట్లూరు మండంలో క్వింటాలుకు నెలకు రూ.10 వసూలు చేస్తున్నారు.

గిట్టుబాటు ధర వస్తేనే గట్టెక్కేది



పంట పండుతుందన్న ఆశతో ప్రతి ఏడాది పప్పుశనగ పంట సాగుచేస్తున్నా. గతేడాది 50 ఎకరాల్లో పప్పుశనగ పంట సాగు చేశాను. ఎకరాకు 4 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. ఈసారి దిగుబడి తగ్గినా ధరలు అంతంతగానే ఉన్నాయి. దిగుబడి తగ్గినప్పుడు సాధారణంగా ధరలు పెరగాలి. మరెందుకో పంట కోత సమయం నుంచి ఇప్పటి దాకా ధరలో పెద్దగా మార్పు కనిపించడం లేదు. ధర పెరగకపోతుందా..? అన్న ఆశతో పంటనంతా గోదాముల్లో నిల్వ చేశా. గిట్టుబాటు ధర వస్తేనే గట్టెక్కేది. లేకుంటే నష్టపోవాల్సిందే.

- బి.ఆదినారాయణ, తగ్గుపర్తి, బెళుగుప్ప మండలం

పంటంతా గోదాములోనే నిల్వ చేశా



గతేడాది రబీలో 25 ఎకరాల్లో పప్పుశనగ పంట సాగు చేశా. ఎకరాకు 4 నుంచి నాలుగున్నర క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ప్రభుత్వం కల్పించిన మద్దతు ధర కంటే బహిరంగ మార్కెట్‌లో కొంత ఎక్కువగా ఉంది. పెట్టుబడులు ఎక్కువైనందున ఆ ధరకు పంటను అమ్మితే నష్టమే. అందుకే ఈసారి రైతులెవరూ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో పంటను విక్రయించలేదు. గతేడాది పప్పుశనగ పంటంతా గోదాములోనే నిల్వ చేశా. ఐదేళ్లుగా ఆశించిన మేరకు ధరలు లేకపోవడంతో నష్టపోతూనే ఉన్నాం. ఈసారి ఏమైతుందోనని ఆందోళనగా ఉంది.

-రుద్రయ్య, ఎర్రగుడి, బెళుగుప్ప మండలం

తప్పనిసరిగా కదల్లేదు..!

● ఐదేళ్లు దాటినా అక్కడే తిష్ట
● జడ్పీ బదిలీల్లో మాయాజాలం
● చక్రంతిప్పిన యూనియన్ నాయకులు, అధికారులు



కౌన్సెలింగ్ చేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్, సీఈఓ

అనంతపురం విద్య, మే 31(ఆంధ్రజ్యోతి): జడ్పీలో బదిలీల్లో అయినవారికి అనుకున్న చోటే పీటమేశారు. కాని వారిని సాగనంపారు. తొమ్మిదేళ్లు.. పదేళ్లు ఒకేస్థానంలో పనిచేసిన ఉద్యోగులు కదలాల్సి ఉన్నా.. పాత స్థానాలనే దక్కించుకున్నారు. కొందరు గొంతెత్తి అడిగినా పాత స్థానాలను ఇవ్వలేదు. కొందరు సంఘాల నాయకులు, అధికారులు తెర వెనుక తతంగం నడిపారు. దీనికి పాలకులు, అధికారులు రైట్ రైట్ అంటూ తలులు ఊపారు. జడ్పీ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా జడ్పీ ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్ శనివారం నిర్వహించారు. జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, సీఈఓ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ జరిగింది.

తప్పనిసరి అయినా..

రెండు జిల్లాల్లో ఐదేళ్ల ఒకేచోట పనిచేసిన కొందరు ఉద్యోగులను పాలకులు, అధికారులు కదిలించలేదు. నిబంధనల మేరకు వారు ఖచ్చితంగా బదిలీ కావాల్సి ఉన్నా పట్టించుకోలేదు. అదే స్థానంలో ఉంటామని కొందరు అడిగిందే తడవు అనుగ్రహించారు. మరికొందరు ఐదేళ్ల సర్వీసు పూర్తి అయిందని, మరో ప్రాంతానికి వెళతామని అడిగినా.. వారు కోరిన స్థానాలుగాని, ఆప్షన్ పెట్టినవిగాని ఇవ్వలేదు. కౌన్సెలింగ్‌లో కొందరు సంఘాల నాయకులు, జడ్పీలో చక్రం తిప్పే కొందరు అధికారుల హవా నడిచింది. వారు చెప్పినట్లు కౌన్సెలింగ్ నిర్వహించారని ప్రచారం జరుగుతోంది. తమకు తీరని అన్యాయం చేశారని బాధిత ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బదిలీ అయిన జడ్పీ ఉద్యోగుల వివరాలు

కేడర్	తప్పసరి దరఖాస్తులు	తప్పసరి బదిలీ	రిక్వెస్టు దరఖాస్తులు	రిక్వెస్టు బదిలీ
ఎంపీడీఓలు	0	0	8	4
అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు	0	0	13	6
సీనియర్ అసిస్టెంట్లు	10	4	16	3
జూనియర్ అసిస్టెంట్లు	6	2	32	15
టైపిస్టులు	3	0	9	3
రికార్డు అసిస్టెంట్లు	46	12	16	3
ల్యాబ్ అసిస్టెంట్లు	12	9	5	3
లైబ్రరీ అసిస్టెంట్లు	1	1	0	0
ఆఫీస్‌సబార్డినేట్స్	74	14	14	11
మొత్తం	152	42	113	48



జడ్పీ మెయిన్ హాల్ వద్ద ఉద్యోగుల హడావుడి

అధికారుల లెక్కలు ఇవీ...

ఉమ్మడి జిల్లాలో నలుగురు ఎంపీడీఓలు బదిలీ అయ్యారని అధికారులు ప్రకటించారు. విజయ భాస్కర్ ముదిగుప్ప మండలం నుంచి బొమ్మనహాళ్ మండలానికి, ఆజాద్ రామగిరి మండలం నుంచి తనకల్లుకు, గంగావతి నార్పల మండలం నుంచి రామగిరికి, మమతాదేవి తనకల్లు నుంచి నార్పలకు బదిలీ అయినట్లు ప్రకటించారు. తప్పనిసరి బదిలీ కింద 152 మంది ఉద్యోగులు దరఖాస్తు చేయగా 42 మందిని, రిక్వెస్టు కింద 113 మంది దరఖాస్తు చేయగా 48 మందిని బదిలీ చేసినట్లు జడ్పీ అధికారులు ప్రకటించారు. వీరిలో ఎంపీడీఓలు, ఏవోలు, సీనియర్ అసిస్టెంట్లు, ఇతర ఉద్యోగులు ఉన్నారు.

ఆర్అండ్‌బీలో క్లరికల్ సిబ్బందికి బదిలీలు



సిబ్బందికి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్ఈ రాజగోపాల్

అనంతపురం న్యూటౌన్, మే 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆర్అండ్‌బీలో ఉన్న క్లరికల్ సిబ్బందికి ఎస్ఈ రాజగోపాల్ ఆధ్వర్యంలో సర్కిల్ కార్యాలయంలో శనివారం బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఐదేళ్లు ఒకే చోట ఉద్యోగ కాలాన్ని పూర్తి చేసుకున్న వారితో పాటు జీఓలో పేర్కొన్న విధంగా అర్హతలు ఉన్న వారు కూడా కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. జూనియర్ అసిస్టెంట్లు-8, టైపిస్టు-2, రికార్డు అసిస్టెంట్లు-3, అటెండర్లు-33, వర్క్‌ఇన్‌స్పెక్టర్లు 4, డ్రైవర్లు ఇద్దరు అప్షన్లు ఇవ్వడంతో కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. అందుకు అనుగుణంగా జాబితా తయారు చేసి తుది జాబితాను వెల్లడించనున్నట్లు ఎస్ఈ తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్ డిప్యూటీ ఎస్ఈ రమాదేవి, ఎన్‌హెచ్ ఈఈ సుధాకర్ రెడ్డి, ఆర్అండ్‌బీ ఈఈలు ప్రసాద్‌రెడ్డి, సంజీవయ్య పాల్గొన్నారు.

డీపీఓలో కార్యదర్శులకు...

జిల్లా పంచాయతీ కార్యాలయంలో శనివారం పంచాయతీ కార్యదర్శులు గ్రేడ్-1 నుంచి గ్రేడ్-4 వరకు ఒకేచోట ఐదేళ్ల ఉద్యోగ కాలాన్ని పూర్తి చేసిన వారికి డీపీఓ నాగరాజునాయుడు ఆధ్వర్యంలో బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. గ్రేడ్-1, ఆరుగురు, గ్రేడ్-3, 11 మంది, గ్రేడ్-4 32 మందితోపాటు మరో ముగ్గురు డిప్యూటీ ఎంపీడీఓలు మొత్తం 52 మందికి కౌన్సెలింగ్ నిర్వహించినట్లు డీపీఓ పేర్కొన్నారు. బదిలీల జాబితా తయారు చేసి కలెక్టర్ ఆమోదానికి పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ విజయ్‌కుమార్, ఏఓ నాగరాజు, సీనియర్ అసిస్టెంట్లు లీలాబాయి, ఉష తదితరులు పాల్గొన్నారు.



కార్యదర్శుల బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీపీఓ నాగరాజనాయుడు

తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలు గుంతకల్లు వరకు పొడిగింపు



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఎర్రగుంట్ల/కొండాపురం, మే 31(ఆంధ్రజ్యోతి): కడప-విశాఖపట్నం మధ్య నడిచే తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలు (ట్రైన్ నెంబర్18521/18522) ను జూన్ 2 నుంచి గుంతకల్లు వరకు పొడిగించినట్లు ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు కడప నుంచి గుంతకల్లు వరకు ఈ ట్రైన్‌ను స్పెషల్ ట్రైన్ (నెంబర్ 07521 /07522) గా ట్రీట్ చేస్తూ రైల్వేశాఖ ఉత్తర్వులు జారీచేసింది. విశాఖపట్నం నుంచి కడపకు ఉదయం 7..45 గంటలకు చేరుకుని ఎర్రగుంట్ల, కొండాపురం, తాడిపత్రి, గుత్తి మీదుగా గుంతకల్లుకు ఉదయం 11.15కు చేరుతుంది. తిరిగి గుంతకల్లులో మధ్యాహ్నం 1.30కి బయలుదేరి కడపకు సాయంత్రం 5.15 కు చేరుకుంటుంది. అక్కడి నుంచి విశాఖపట్నం వెళుతుంది. గతంలో కడప-కొండాపురం మధ్య ఖాళీగా వెళ్లే ఈ రైలుకు ఎర్రగుంట్ల, కొండాపురం రైల్వేస్టేషన్‌లలో స్టాపింగ్ ఇవ్వాలని 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనాలు ప్రచురించింది. అంతేకాకుండా స్టాపింగ్ కోసం ప్రజాప్రతినిధులు, పలు ప్రజాసంఘాలు రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఒత్తిడి తెచ్చారు. దీంతో ఈ రైలును కడప నుంచి గుంతకల్లు వరకు పొడిగించడంతో పాటు ఎర్రగుంట్ల, కొండాపురం, తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు రైల్వేస్టేషన్‌లలో స్టాపింగ్ ఇస్తూ రైల్వేశాఖ ఉత్తర్వులు జారీచేసింది. దీంతో జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



మాట్లాడుతున్న విద్యానృసింహ భారతి స్వామి

ధర్మ పరిరక్షణ కోసం ఏకతాటిపైకి రావాలి

● విద్యా నృసింహ భారతి స్వామి
● ముగిసిన బజరంగ్‌దళ్ శిక్షణా తరగతులు

అనంతపురం కల్చరల్, మే 31(ఆంధ్రజ్యోతి): దేశంలో ధర్మ పరిరక్షణ కోసం అన్నివర్గాలవారూ ఏకతాటిపైకి రావాలని విద్యానృసింహ భారతిస్వామి అన్నారు. నగర శివారు వడియంపేట వద్ద గల కేశవరెడ్డి పాఠశాలలో విశ్వ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు తాళంకి వెంకటరత్నమయ్య ఆధ్వర్యంలో ఈనెల 27 నుంచి నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి బజరంగ్‌దళ్ శిక్షణా తరగతులు శనివారం ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమానికి విద్యా నృసింహభారతి స్వామి హాజరై ప్రసంగించారు. యువత దేశ రక్షణ, ధర్మ పరిరక్షణే ధ్యేయంగా భావజాలాన్ని పెంపొందించుకోవాలన్నారు. సమాజంలో హిందూధర్మ వ్యతిరేకవాదులు చేస్తున్న అరాచకాలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ ఉభయ తెలుగు రాష్ట్రాల కార్యదర్శి తనికెళ్ల సత్యరవికుమార్, బజరంగ్‌దళ్ ఉభయ తెలుగు రాష్ట్రాల కన్వీనర్ వీరకుమార్‌స్వామి, పోలేపల్లి సందీప్, కసాపురం రవి, జిల్లా కార్యదర్శి విశ్వనాథరెడ్డి, సహాయ కార్యదర్శి బొబ్బ కిషోర్‌నాయుడు, జిల్లా కన్వీనర్ సురేంద్రబాబు, ఉపాధ్యక్షుడు కోనేటి రమణ బాబు, జిల్లా గోరక్ష ప్రముఖ్ గుర్రం సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



పదవీ విరమణ పొందిన ఉద్యోగులను అనంతపురం కలెక్టరేట్‌లో కలెక్టర్ వినోద్‌కుమార్, జేసీ శివనారాయణ శర్మ తదితర అధికారులు సత్కరించారు. మొత్తం 33 మంది ఉద్యోగులు, అధికారులు, అధ్యాపకులు పదవీ విరమణ పొందిన సందర్భంగా కలెక్టరేట్‌కు వచ్చి.. అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

మహానాడుతో వైసీపీ శ్రేణుల మైండ్‌బ్లాక్

● ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్



లబ్ధిదారుడికి పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం రూరల్, మే 31(ఆంధ్రజ్యోతి): మహానాడుతో వైసీపీ శ్రేణుల మైండ్ బ్లాక్ అయిందని, అది చూసి వారికి ఏం చేయాలో తెలియక వెన్నుపోటు దినోత్సవం అంటూ హడావుడి చేస్తున్నారని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. తాము జూన్ 4వ తేదీన 'విధ్వంసం నుంచి అభివృద్ధి వైపు' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయన శనివారం మండలంలోని ఎ.నారాయణపురం పంచాయతీ సోమనాథ్‌నగర్ చౌరస్తా నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. అనంతరం 41, 50, 44వడివిజన్లలో పింఛన్లు పంపిణీ చేశారు. ఉద్యోగుల మీద ఎవరైనా దురుసుగా వ్యవహరిస్తే ఉపేక్షించేది ఉండదని, రెండు రోజుల క్రితం సచివాలయం ఉద్యోగిని టీడీపీ స్థానిక నాయకుడు ఫోన్లో దూషించిన సంఘటనపై చర్యలు ఉంటాయన్నారు. నగరపాల క సంస్థ కమిషనర్ బాలస్వామి, తహసీల్దార్ హరికుమార్, టీడీపీ రాష్ట్ర నాయకులు రాయల్ మురళితదితరులు పాల్గొన్నారు.

ఈ నెలలోనే రెండు పథకాల అమలు

● ఎమ్మెల్యే పరిటాల సునీత



వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం రూరల్, మే 31(ఆంధ్రజ్యోతి): హామీలు అమలు చేయడం లేదని ప్రభుత్వం విమర్శలు చేస్తున్న వారికి బుద్ధి చెప్పేవిధంగా ఈ నెలలోనే తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలు అమలవుతాయని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. ఆమె శనివారం మండలంలోని కక్కలపల్లికాలనీ పంచాయతీ పిల్లిగుండ్ల కాలనీలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ చేపట్టారు. డిప్యూటీ ఎంపీడీఓ వెంకటనాయుడు, టీడీపీ మండల కన్వీనర్ జింకా సూర్య నారాయణ, ప్రధాన కార్యదర్శి పాముురాయి రఘు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పింఛన్ పంపిణీ చేసిన నాయకులు



చెన్నేకొత్తపల్లి, మే31(ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం ఉదయం నుంచే అధికారులు, సిబ్బంది ఆయా గ్రామాలలో ఇంటింటికి వెళ్లి పంపిణీచేశారు. ప్యాదిండి గ్రామంలో ఎంపీడీఓ బాలకృష్ణుడు, టీడీపీ మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి పింఛన్లను పంపిణీ చేశారు. శనివారం 93శాతం పూర్తిచేశామని ఎంపీడీఓ తెలిపారు.




● కనగానపల్లి: మండలంలోని ముక్తాపురం గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను డీసీఎంఎస్, మార్కెట్ యార్డ్ చైర్మన్లు నెట్టెం వెంకటేష్, సుధాకర్‌చౌదరి పంపిణీ చేశారు.



గుమ్మేపల్లిలో పంపిణి చేస్తున్న దేగల కృష్ణమూర్తి

● శింగనమల: ఎన్టీఆర్ సామాజిక పింఛన్లను శనివారం గుమ్మేపల్లిలో రాష్ట్ర పంచాయతీ రాజ్ చాంబర్ కార్యనిర్వ హణ కార్యదర్శి, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి దేగల కృష్ణమూర్తి ఇం టింటికి వెళ్లి పంపిణీ చేశారు. అలాగే శింగనమలలో నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.ఆదినారాయణ, టీడీపీ సీనియర్ నాయకుడు మాసూల చంద్రమోహన్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూరు, మే 31(ఆంధ్రజ్యోతి): మండలంలో పింఛన్లు పంపణీ కార్యక్రమం శనివారం సజావుగా సాగింది. ఒకటో తేదీకి ముందురోజే పింఛన్లు పంపిణీ చేయడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రత్యేక చొరవతో మండలంలో ఈ నెల 80మందికి పైగా కొత్త పింఛన్లు మంజూరు చేయించారు. తోపుదుర్తిలో పది మందికి మండలనాయకులు చేతులు మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు, పార్లమెంటు అధికార ప్రతినిధి శశాంక్ చౌదరి, నాయకులు శ్రీనివాస రెడ్డి, బాబు, నారాయణస్వామి, లింగమయ్య, రాజేష్, చంద్రశేఖర్, సోము తదితరులు పాల్గొన్నారు.



పింఛన్ పంపిణీ చేస్తున్న ఆలం వెంకట నరసానాయుడు

నార్పల, మే 31(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రమైన నార్పల, మండలంలోని బొందలవాడ గ్రామాల్లో టీడీపీ జిల్లా నాయకుడు ఆలం వెంకట నరసానాయుడు శనివారం ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు.

నాణ్యమైన విత్తనం సరఫరా చేయాలి

● ఏపీ సీడ్స్ మేనేజర్ సుబ్బయ్య

అనంతపురం అర్బన్, మే 31 (ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాలకు నాణ్యమైన విత్తన వేరుశనగ మాత్రమే సరఫరా చేయాలని ఏపీ సీడ్స్ మేనేజర్ సుబ్బయ్య ఆదేశించారు. ఆయన శనివారం అనంతపురం నగరం గుత్తి రోడ్డులోని హిమబిందు ప్రాసెసింగ్ యూనిట్‌లో విత్తన వేరుశనగ ప్రాసెసింగ్, నాణ్యతను పరిశీలించారు. విత్తన వేరుశనగ ప్రాసెసింగ్ పక్కాగా చేయాలని సూచించారు. అలాగే వేరుశనగ మొలక శాతాన్ని పరిశీలించి, నాణ్యమైన విత్తన కాయలను సరఫరా చేయాలన్నారు. నిబంధనలు ఎవరు అతిక్రమించినా చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు.

ప్లాస్టిక్ ఎప్పుడో..?

● నగరంలో విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం
● జిల్లా కేంద్రంలో బడా వ్యాపారులు
● జిల్లా అంతటా ఇక్కడి నుంచే సరఫరా
● ముడుపులతో కొందరు అధికారుల మౌనం
● తాజాగా శానిటేషన్ సెక్రెటరీలపై ఒత్తిడి

అనంతపురం క్రైం, మే 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్లాస్టిక్ వినియోగం భారీగా పెరిగింది. నగరంలోని బడా వ్యాపారులు ఏళ్ల తరబడి జిల్లా అంతటికీ ప్లాస్టిక్ విక్రయిస్తున్నా పట్టించుకునే నాథుడే లేడు. వారిపై చర్యలు తీసుకోవడంలో వెనుకంజ వేస్తున్నారనే ఆరోపణలను నగరపాలక సంస్థ అధికారులు మూటగట్టుకుంటున్నారు. ప్రతి దుకాణం తనిఖీ చేసి, ప్లాస్టిక్ వాడుతుంటే జరిమానా విధించాలని ఇటీవల అధికారుల నుంచి ఆదేశాలందాయి. దీంతో ఈ అంశం మరోమారు చర్చకు వచ్చినట్లైంది.



ప్లాస్టిక్ దుకాణంలో తనిఖీలు (ఫైల్)

నిషేధం అమలు ఎప్పుడో...?

నగరంలో తోపుడు బండ్ల నుంచి రూ.లక్షల్లో టర్నోవర్ చేసే వ్యాపారుల వరకు దాదాపు అందరూ ప్లాస్టిక్ వినియోగిస్తున్నారు. ప్రధానంగా హోల్‌సేల్ వ్యాపారుల నుంచే దుకాణాలకు ప్లాస్టిక్ కవర్లు సరఫరా అవుతున్నాయి. నగరంలో సంచరించే ఆవులు సైతం ఈ ప్లాస్టిక్ కవర్లు తిని అనారో గ్యం పాలవుతున్నాయి. కమిషనర్ ఆదేశాల మేరకు గురువారం నగరంలో 11 బృందాలు తనిఖీలు చేపట్టాయి. అధికారులు తూతూ మంత్రంగా తనిఖీలు చేసి, చిరు వ్యాపారుల పై జరిమానాలు విధిస్తున్నారు కానీ ప్లాస్టిక్ పెద్ద మొత్తంలో విక్రయించే వ్యాపారులపై చర్యలు తీసుకోవడం లేదు. దీంతో ప్లాస్టిక్ నిషేధం సాధ్యమేనా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

నెలవారీ ముడుపులు

నగరంలో ప్లాస్టిక్ నిషేధానికి సంబంధించి అధికారులు ముందుకెళ్లినా రాజకీయ శక్తులు బ్రేక్ వేస్తున్నాయి. నగరానికి వచ్చిన ప్రతి కమిషనర్ హయాంలోనూ ప్లాస్టిక్ తనిఖీలు జరిగినా, పూర్తి స్థాయిలో చర్యలకు ఉపక్రమించింది లేదు. నగరం మొత్తం 25వరకు ప్రధాన హోల్‌సేల్ వ్యాపారులు కొన్నేళ్లుగా ప్లాస్టిక్ విక్రయిస్తున్నారు. కొన్ని దుకాణాల నుంచి అధికారులకు నెలవారీ రూ. ఆరువేల నుంచి రూ. 20వేల వరకు ముడుపులు అందుతున్నట్లు సమాచారం. ఏడాదిన్నర కిందట అధికారులు తనిఖీలు చేయగా, బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏకంగా మేయర్ చాంబర్‌లో మేయర్ సమక్షంలోనే అధికారులను దుర్భాషలాడారు. అప్పటి నుంచి తనిఖీలు ఉత్తుత్తిగానే మారాయి. పాతూరు, కమలానగర్, రాజు రోడ్డు తదితర ప్రాంతాల పరిధిలో అధికంగా ప్లాస్టిక్‌ను విక్రయిస్తున్నారు. వాటిపై దాడులు చేసే పరిస్థితుల్లో అధికారులు లేరనే విమర్శలున్నాయి. ప్రస్తుత పాలక వర్గంలోని కొందరు వైసీపీ కీలక నాయకులు, బీజేపీ నాయకుల అండదండలు ప్లాస్టిక్ వ్యాపారులకు ఉన్నట్లు సమాచారం. తాజాగా కొందరు అధికారపార్టీ నేతల చెంతకు చేరినట్లు సమాచారం.

ఆయన చెప్పాడు...వీళ్లు పాటిస్తున్నారు

ఇక్కడ గతంలో ఎంహెచ్‌ఓగా పనిచేసిన అధికారి పారిశుధ్యం, ప్లాస్టిక్ విషయాల్లో చేసిన వ్యవహారాలను ప్రస్తుత అధికారులు గుడ్డిగా పాటిస్తున్నారు. ఆయన ఏడాదే పనిచేసినా నగరపాలికకు చేయాల్సిన నష్టాన్నంతా చేసేశారు. డబ్బులు, బొచ్చు కుక్కపిల్లలు తీసుకుని అర్హత లేకపోయినా శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టులిచ్చేశాడు. ప్లాస్టిక్ విషయంలో ఓ స్వచ్ఛంద సంస్థకు చెందిన వారు ఉండాలంటూ ఓ ప్రైవేట్ వ్యక్తిని భాగస్వామిని చేశారు. ఆయన లేకుండా అధికారులు తనిఖీలకు సైతం వెళ్లారంటే అతిశయోక్తి కాదు. అధికారిక మీటింగ్‌లో సైతం ఆ ప్రైవేట్ వ్యక్తి శానిటేషన్ సెక్రటరీలను లేపి మరీ సంజాయిషీ అడుగుతారట. ఇక కీలకంగా పనిచేసిన అధికారి ప్లాస్టిక్ అధికంగా విక్రయించే ప్రతి దుకాణం నుంచి నెలనెలా ముడుపులు పుచ్చుకునే వారని సమాచారం. ఇప్పుడు కూడా ఆయన చేసిన వ్యవహారాలు కొన్ని పనిచేస్తున్నట్లు తెలుస్తోంది.

జరిమానాలు వేయకపోతే మెమోలే

ఇప్పుడు ప్లాస్టిక్ విషయంలో నగరపాలిక సిబ్బందిపై తీవ్ర ఒత్తిళ్లు వస్తున్నాయి. శానిటేషన్ సెక్రటరీలు తమ పరిధిలో జరిమానాలు విధించాలని ఉన్నతాధికారులు ఆదేశాలిస్తున్నారు. లేకపోతే మెమోలు జారీ చేస్తారనే హెచ్చరికలు జారీ చేసినట్లు సమాచారం. దీంతో సచివాలయాల పరిధిలో శానిటేషన్ సెక్రటరీలు దుకాణాల వెంట పరుగులు తీస్తున్నారు. చిన్న దుకాణాలకైతే రూ.2500, పెద్ద దుకాణాలకు రూ.20వేల నుంచి రూ.25 వేల వరకు జరిమానాలు విధిస్తున్నారు. ప్లాస్టిక్ వాడకపోయినా ఇలా రసీదులు ఇస్తుండటంతో దుకాణ నిర్వాహకులు ఆశ్చర్యపోతున్నారు. ఈజరిమానాలు ఏమాత్రం వసూలు కానట్లు తెలుస్తోంది. కీలక వ్యాపారుల నుంచి మూలాలను తుడిచి పెట్టకుండా చిన్న వ్యాపారులపై పడితే ఏమాత్రం ప్రయోజనం ఉండదనే అభిప్రాయం పలువురి నుంచి వ్యక్తం అవుతోంది.

భక్తాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం



వడమాలలతో ఆంజనేయస్వామి

అనంతపురం కల్చరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): నగరంలోని హౌసింగ్ బోర్డులో వెలసిన భక్తాంజనేయస్వామి ఆలయ పదో వార్షికోత్సవాలను శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి మూలవిరాట్‌ను ఐదు వేల వడలతో చేసిన మాలలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేవారు. అనంతరం ఆలయ ఆవరణలో గోపూజ, సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. అన్న దాన వినియోగం చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పరుచూరు రమేష్‌బాబు, కార్యవర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

జేవీవీలో భాగస్వాములు కండి : మాజీ ఎమ్మెల్సీ

అనంతపురం కల్చరల్, మే 31(ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం నిరంతరం కృషి చేస్తున్న జన విజ్ఞాన వేదిక(జేవీవీ)లో ప్రజలు భాగస్వాములు కావాలని జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని జేవీవీ కార్యాలయంలో శనివారం జేవీవీ సభ్యత్వ ప్రచారానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. జేవీవీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జూన్ 1 నుంచి జూలై 15వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతుందన్నారు. జేవీవీ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ సాకే భాస్కర్, జిల్లా కోశాధికారి మహ్మద్ జిలాన్, నగర నాయకులు రామిరెడ్డి, తిరుపాల్, ప్రసాద్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, రామవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గొడవపై గోప్యం

అనంతపురం క్రైం,మే31(ఆంధ్రజ్యోతి) : నగర శివారులో ఎకరాలోపు స్థలం విషయంలో ఓ కుటుంబంపై కొందరు దాడి చేశారు. అయితే ఈ గొడవలో వారిని ఎవరు కొట్టారనేది గోప్యంగా ఉంచుతున్నారు. నగర శివారులోని బెంగళూరు-హైదరాబాద్ హైవే రహదారిలోని కియ షోరూమ్ వెనుక వైపు కొంత స్థలం ఉంది. ఆ స్థలం నగరంలోని అరవిందనగర్‌కు చెందిన వెంకటేష్‌ప్రసాద్ గుప్తాది. శనివారం ఆ స్థలంలో ఎవరో వచ్చి ఏదో చేస్తున్నారని తెలిసి వెంకటేష్‌ప్రసాద్ గుప్తా, తన కుమారులు ప్రణీత్,సాయినాథ్‌తో కలిసి అక్కడికెళ్లాడు. ఈ విషయంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో వెంకటేష్‌ప్రసాద్ గుప్తాపై దాడి జరిగింది. ఈ ఘటనపై డయల్ 100ద్వారా నాలుగో పట్టణ పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు వెంకటేష్ ప్రసాద్ గుప్తాను విచారించినట్లు తెలిసింది. కానీ ఈ విషయం అక్కడివరకే ఆగింది. కేసు కట్టలేదంటున్నారు? దాడి చేసిన వారు ఎవరో తెలియదని పోలీస్ అధికారులు చెబుతున్నారు. ఆదివారం ఇరువర్గాలతో మాట్లాడి విచారిస్తామని సీఐ సాయినాథ్ తెలిపారు.

'ఉత్తమ జీవన విధానాన్ని అలవర్చుకోవాలి'

అనంతపురం కల్చరల్, మే 31(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి ఉత్తమ జీవన విధానాన్ని అలవర్చుకోవాలని మై భారత్ ప్రోగ్రాం అధికారి శ్రీనివాసులు పేర్కొన్నారు. బుడ్డప్ప నగర్ షికారి కమ్యూనిటీ విద్యార్థులకు సరస్వతి విద్యామందిర్, మై భారత్, సాయి ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో నెలరోజులుగా నిర్వహిస్తున్న సంస్కార కేంద్రం వేసవి శిక్షణా శిబిరం శనివారం ముగిసింది. మై భారత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి శ్రీనివాసులుతో పాటు సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయ సాయికుమార్ ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. శిక్షణా శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యువజన జాగృతి వ్యవస్థాకుడు వెంకటేష్, సరస్వతి విద్యామందిర్ ప్రిన్సిపాల్ వసుంధర, ఉపాధ్యాయినిలు, మై భారత్ కార్యాలయ సిబ్బంది రూబీ, సాయి ట్రస్టు సిబ్బంది రాఘవేంద్ర, నారాయణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్పీ రమణమూర్తికి ఘనంగా వీడ్కోలు



ఏఎస్పీని సన్మానిస్తున్న ఎస్పీ, అధికారులు

అనంతపురం క్రైం,మే31(ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణ, అంకితభావం, సమర్థతకు మారు పేరు అదనపు ఎస్పీ(అడ్మిన్)రమణమూర్తి అని ఎస్పీ జగదీష్ అన్నారు. శనివారం పదవీవిరమణ చేసిన అదనపు ఎస్పీ డీవీ రమణమూర్తిని స్థానిక పోలీసుల కన్వెన్షన్ సెంటర్లో ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు.

ఆఫీస్ సబార్డినేట్ కేశమ్మకు సన్మానం



కేశమ్మను సన్మానిస్తున్న భూగర్భజల శాఖ ఏడీ, సిబ్బంది

అనంతపురం అర్బన్, మే 31(ఆంధ్రజ్యోతి): భూగర్భజల శాఖ ఏడీ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తున్న ఎం.కేశమ్మ శనివారం పదవీ విరమణ చెందారు. రాంనగర్‌లోని ఆ శాఖ కార్యాలయం లో ఏడీ జయరామిరెడ్డి, ఏహెచ్‌ఓ మంజునాథ్, సిబ్బంది జ్ఞాపిక, గాయత్రి, మధుసూదన్ కేశమ్మకు శాలువ కప్పి, పూల మాలలు వేసి సన్మానించారు. ఉపాధ్యాయులు దేవరకొండ రామాంజినేయులు, జయరాంనాయక్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రేపు వెంకటేశ్వర స్వామి కల్యాణం

అనంతపురం రూరల్, మే 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆకుతోటపల్లి మారుతీపురంలో వెలసిన అభయహస్త ఆంజనేయ స్వామి ఆలయంలో సోమవారం లక్ష్మీ వెంకటేశ్వరస్వామి కల్యాణో త్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మధ్యాహ్నం 12గంటలకు కల్యాణోత్సవం ఉంటుందన్నారు.

భక్తిశ్రద్ధలతో అక్కల్‌కోట మహరాజ్ పాదుకా దర్శనం

అనంతపురం కల్చరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): మూడో రోడ్డులోని షిర్డీసాయి బాబా ఆలయంలో శనివారం స్వామి అక్కల్ కోట మహరాజ్ పాదుకా దర్శనాన్ని నిర్వహించారు. హెచ్చెల్సీకాలనీలోని వలీస్వామి ఆశ్రమం ఆధ్వర్యంలో అక్కల్‌కోట నుంచి తెచ్చిన పాదుకలను నగరంలో ఆలయాల్లో ఉంచి దర్శన భాగ్యం కల్పిస్తున్నారు.

రండి... నిలదీద్దాం: అనంత

బుక్కరాయసముద్రం, మే 31(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అరాచకపాలన తప్ప అభివృద్ధి జరిగింది ఏమీ లేదని, ఈ పాలనపై కలిసికట్టుగా నిలదీద్దామని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంతవెంకట్రామిరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండల పరిధిలోని దయ్యాలకుంటపల్లి వద్ద వైసీపీ నియోజకవర్గం సమీక్షా సమావేశం నిర్వహించారు. వీటితో పాటు జూన్4న వైసీపీ తలపెట్టిన వెన్ను పోటు దినోత్సవం కార్యక్రమం విజయవంతం చేయాలని పోస్టర్లు ఆవిష్కరించారు. శింగనమల నియోజకవర్గ ఇన్‌చార్జి సాకే శైలజానాథ్ తదితరులు హాజరయ్యారు.

నేడు సీఏల క్రికెట్ టోర్నీ ప్రారంభం

అనంతపురం క్లాక్‌టవర్, మే31(ఆంధ్రజ్యోతి): చార్టర్డ్ అకౌంటెంట్స్ స్పోర్ట్స్ క్లబ్ క్రికెట్ పోటీలు ఆదివారం ఆర్డీటీ స్టేడియంలో నిర్వహిస్తున్నారు. పోటీల పోస్టర్లను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ శనివారం తన క్యాంపు కార్యాలయంలో విడుదల చేశారు. చార్టెర్డ్ అకౌంటెంట్లు, బ్యాంకర్లు, డాక్టర్ల మధ్య పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

ఇంగ్లిష్ ఎస్ఏ ప్రమోషన్ల కోసం మూడోరోజూ ధర్నా



నిరసన తెలుపుతున్న టీచర్లతో మాట్లాడుతున్న డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురం విద్య, మే 31(ఆంధ్రజ్యోతి): అర్హులైన సీనియర్ టీచర్లకు ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్లు ఇవ్వాలంటూ పలువురు టీచర్లు చేపట్టిన ధర్నా శనివారం మూడో రోజూ కొనసాగింది. బదిలీల ప్రక్రియ జరుగుతున్న నగరంలోని శారదాస్కూల్ ప్రాంగణంలో నిరసన తెలిపారు. బాధిత టీచర్లకు పలు సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఈసందర్భంగా నాయకు లు మాట్లాడుతూ... ఇతర జిల్లాల్లో ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతులు ఇచ్చినా..... అనంతపురం జిల్లాలో ఇవ్వకపోవడం దారుణం అన్నారు. గతంలో వందల్లో ఖాళీలు చూపితే ఇప్పుడు కేవలం 19 మాత్రమే ఉన్నాయనడం సరికాదన్నారు. అనంతరం ధర్నా శిబిరం వద్దకు డీఈఓ ప్రసాద్‌బాబు చేరుకుని, ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు, టీచర్లు సూర్యుడు, సురేష్, కృష్ణారెడ్డి, సూర్యనారాయణ, లక్ష్మీదేవి, విజయశ్రీ, గాయత్రి, శివప్రసాద్, రంగప్ప, శ్రీనివాసులు, ఓబిరెడ్డి, మల్లరాజు, జిలాన్, భాస్కర్, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ



ప్రతిష్ఠించిన సీతారాముల విగ్రహాలు

కనగానపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చంద్రాచర్ల గ్రా మంలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. గ్రామస్థులంతా కలిసి నూతన ఆలయాన్ని నిర్మించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణ నడుమ ఆ ఆలయంలో సీతారామ, లక్ష్మణ సమేత ఆంజనేయస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. సీతారాముల కల్యాణం నిర్వహించి, అన్నదానం చేశారు.

పీజీఆర్ఎస్ అర్జీపై క్షేత్రస్థాయిలో డీఆర్ఓ పరిశీలన

అనంతపురం రూరల్, మే 31(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇచ్చిన వినతి పై డీఆర్ఓ మలోలా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గత నెల 21న మండలంలోని పాముురాయి గ్రామానికి చెందిన ఎం. లక్ష్మీదేవి తనకు కేటాయించిన ఇంటి స్థలం సమస్యపై ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అర్జీ ఇచ్చింది. ఈ నేపథ్యంలో శనివారం ఆర్ఐ సందీప్‌తో కలసి డీఆర్ఓ మలోలా గ్రామంలోని లక్ష్మీదేవి ఇంటికి వెళ్లారు. అర్జీపై ఆరా తీశారు. సమస్యను పరిష్కరించి అర్జీదారురాలికి న్యాయం చేస్తామని ఆయన పేర్కొన్నారు.

మానవ మృగాలను కఠినంగా శిక్షించాలి

● అహుడా చైర్మన్ టీసీ వరుణ్



మాట్లాడుతున్న అహుడా చైర్మన్ టీసీ వరుణ్

అనంతపురం సెంట్రల్, మే 31(ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలో చిన్నారిపై లైంగిక వేధింపులకు పాల్పడిన మానవ మృగాలను కఠినంగా శిక్షించాల్సిన అవసరముందని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు, అహుడా చైర్మన్ టీసీ వరుణ్ పేర్కొన్నారు. ఆయన శనివారం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు.బాలికలపై జరుగుతున్న అకృత్యాలను అరికట్టి, పోక్సో చట్టాన్ని మరింత కఠినతరం చేయాల్సిన అవసరముందన్నారు. ఈ ఘటనపై జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తీవ్రంగా స్పదించారన్నారు. అశ్లీల వెబ్‌సైట్‌లను నిషేధించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు.

వికసిత్ కృషి సంకల్ప అభియాన్ ప్రారంభం



కార్యక్రమంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త రాజన్న

గార్లదిన్నె, మే 31(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో ఆధునాతన సాంకేతికతలను అనుసంధానించి వ్యవసాయ రంగంలో రైతులను అభివృద్ధి చేసేందుకు వికసిత్ కృషి సంకల్ప అభియాన్ ఎంతగానో దోహదపడుతుందని జిల్లా వ్యవసాయ శాఖ (జేడీఏ) అధికారి ఉమామహేశ్వరమ్మ పేర్కొన్నారు. మండల పరిధిలోని మర్తాడు, కోటంక గ్రామాల రైతు సేవా కేంద్రాలలో శనివారం వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జేడీఏ ఉమా మహేశ్వరమ్మ, కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్త మల్లేశ్వరి, వేరుశనగ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త రాజన్న ముఖ్య అతిథులు గా హాజరయ్యారు. ఈ సందర్భంగా జేడీఏ మాట్లాడుతూ... ఆధుని క సాంకేతికత, కొత్త విత్తన రకాలు తదితర వాటిపై రైతులకు అవగాహన కల్పించేందుకు దేశ వ్యాప్తంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని మే 29 నుంచి జూన్ 12 వరకు నిర్వహిస్తున్నాయని తెలిపారు. ఉద్యానవన శాఖాధికారి రత్నకుమార్, ఏఓ సోమశేఖర్, శాస్త్రవేత్తలు సుధీర్, ఎస్ఎంటి శశికళ, సర్పంచు లక్ష్మి, ఏఈఓ హరిత, ఏహెచ్‌ఓ నరేష్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడు రాజేష్‌పై చర్యలు తీసుకోండి

● టూటౌన్ సీఐకి సచివాలయ ఉద్యోగుల ఫిర్యాదు



విలేకరులతో మాట్లాడుతున్న అశ్వత్థరెడ్డి, ఉద్యోగులు

అనంతపురం క్రైం, మే 31(ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగిని దుర్భాషలాడిన టీడీపీ నాయకుడు రాజేష్‌నాయుడుపై చర్యలు తీసుకో వాలని సచివాలయ ఉద్యోగులు టూటౌన్ సీఐ శ్రీకాంత్‌కు ఫిర్యాదు చేశారు. రెండు రోజుల క్రితం 29వ సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ అశ్వత్థరెడ్డితో ఫోన్‌లో మాట్లాడిన రాజేష్ నాయుడు బూతుపురాణం అందుకున్నాడని, ఈ ఘటనపై నగరంలోని సచివాలయ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. సీఐ శ్రీకాంత్ కు అశ్వత్థరెడ్డితో కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. మహానాడుకు ప్రజలను తీసుకెళ్లడం తమకు సంబంధంలేని విషయమని, కానీ ఆ విషయంలో తమను దుర్భాషలాడినందుకే ఫిర్యాదు చేశామన్నారు. కాగా పోలీసులు రాజేష్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

రేపు గుత్తి కోటలో యోగాంధ్ర

గుత్తి, మే 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలో జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక సోమవారం కలెక్టర్ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తహసీల్దారు ఓబులేసు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగాంధ్రా కార్యక్రమాన్ని స్థానిక గుత్తికోటలోని గుర్రపుశాల వద్ద నిర్వహించనున్నామన్నారు. వెయ్యి మందికిపైగా ఔత్సాహికులతో యోగా చేపట్టనున్నట్లు చెప్పారు. ఉదయం 6 నుంచి 8 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. అనంతరం ఆర్ఎస్ రోడ్డులోని వసుధ ఫంక్షన్ హాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను ఈ వేదిక ద్వారా కలెక్టర్‌కు విన్నవించుకోవాలని సూచించారు. అన్నిశాఖల జిల్లా అధికారులు పాల్గొననున్నట్లు వెల్లడించారు. ఇన్‌చార్జి డీటీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు-అనంతపురం రైల్వేలైన్ తనిఖీ


కల్లూరు వద్ద ట్రాక్ లింక్‌లను పరిశీలిస్తున్న డీఆర్ఎం

గుంతకల్లు, మే 31 (ఆంధ్రజ్యోతి): రైల్వే డివిజన్‌లోని గుంతకల్లు - అనంతపురం సెక్షన్‌ను డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా శనివారం తనిఖీ చేశారు. ప్రత్యేక రైలులో రీర్ విండో ద్వారా ట్రాక్ నాణ్యతను పరిశీలించారు. కల్లూరు వద్ద 38-బీ ట్రాక్ లింక్‌ను తనిఖీ చేశారు. కల్లూరు సమీపంలోని పెన్నా నదిపై నిర్మించిన రైలు వంతెనను సందర్శించి భద్రతా ప్రమాణాలను పరిశీలించారు. ఆపరేటింగ్, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

వ్యాపారులకు తోడ్పాటునందించాలని వినతి

పామిడి, మే 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వస్త్ర వ్యాపారం చేసేవారు అధికంగా ఉన్నారని, వారికి అనుకూలంగా గార్లదిన్నె మండలం కల్లూ రు రైల్వే జంక్షన్‌లో ముంబాయి, కుర్లా, విజయవాడ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపి తోడ్పాటునందించాలని వ్యాపారులు రైల్వే డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తాను వేడుకున్నారు. కల్లూరు రైల్వే జంక్షన్ పరిశీలనకు శనివారం ఆయన రావడంతో విషయం తెలుసుకున్న వ్యాపారులు వెళ్లి కలిసి వినతిపత్రం అందజేసి ఘనంగా సత్కరించారు. గతంలో ఈ రైళ్లు ఐదు నిమిషాలు పాటు కల్లూరు రైల్వే జంక్షన్‌లో ఆగేవన్నారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోవడంతో ముంబాయి, విజయవాడకు వెళ్లే వ్యాపారులు, ప్రయాణికులు అనంతపురం, గుత్తి, డోన్‌కు వెళ్లి రైళ్లు ఎక్కుతున్నారన్నారు. ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉండేందుకు కల్లూరు జంక్షన్‌లో ఐదు నిమిషాలు ఈ రైళ్లను నిలపాలని కోరారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు బీకే రహీం, వ్యాపారులు జాకీర్ హుస్సేన్, ఎంసీ షఫీ, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

కుట్టుశిక్షణను సద్వినియోగం చేసుకోండి

విడపనకల్లు, మే 31(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణను మహిళలు, యువతులు సద్వినియోగం చేసుకోవాలని బీసీ కార్పొరేషన్ జిల్లా కో-ఆర్డినేటర్ రజియా బీ సూచించారు. మండలకేంద్రంలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని శనివారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు ఈ కుట్టు శిక్షణ కేంద్రాలను నిర్వహిస్తోందన్నారు. శిక్షణ మూడు మాసాలు ఉంటుందన్నారు. శిక్షణ అనంతరం మహిళలకు సర్టిఫికెట్‌తో పాటుగా ఉచితంగా కుట్టు మిషన్‌ను ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. అవకాశాన్ని మండలంలోని మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఎంపీడీఓ షకీలాబేగం, సిబ్బంది పాల్గొన్నారు.

ఎద్దుల బండిని ఢీకొన్న బొలెరో వాహనం

- ఎద్దు మృతి.. మరోఎద్దు, రైతుకు తీవ్రగాయాలు

విడపనకల్లు, మే 31(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ఎద్దు మృతిచెందగా మరో ఎద్దుకు, రైతుకు తీవ్ర గాయాలయ్యాయి. విడపనకల్లు మండలకేంద్రానికి చెందిన రైతు బుడ్డీరప్ప గారి సుంకన్న తన పొలంలో సేద్యం చేయటానికి శనివారం ఉదయాన్నే ఎద్దుల బండిపై బయలు దేరాడు. కొద్దిదూరం వెళగానే.. పెట్రోల్ బంక్ సమీపంలో ఉరవకొండ నుంచి బళ్లారికి మామిడి పండ్ల లోడుతో వెళ్తున్న బొలెరో వాహనం వెనుక నుంచి వేగంగా వచ్చి ఎద్దుల బండిని ఢీకొంది. ప్రమాదంలో రైతుకు తీవ్ర గాయాలయ్యాయి. ఒక ఎద్దు అక్కడిక్కడే మృతి చెందింది. మరో ఎద్దుకు తీవ్ర గాయాలై నడవకుండా పడిపోయింది. ఎడ్లబండి పూర్తిగా ధ్వంసమైంది. రైతును స్థానికులు అక్కడే ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన బొలేరో వాహనం డ్రైవర్ తప్పించుకుని పోయి కర్ణాటక సరిహద్దులోని ఆదర్శ పాఠశాల వెనుక కొండల్లో ముళ్ల పొదల్లో వాహనాన్ని దాచి ఉంచాడు. గ్రామస్థులు సమాచారం తెలుసుకుని వెళ్లగా.. గమనించిన డ్రైవర్ వాహనాన్ని వదిలి పరారయ్యాడు. వాహనాన్ని తెచ్చి విడపనకల్లు పోలీసులకు అప్పగించినట్లు గ్రామస్థులు తెలిపారు.

ధర్నాను విజయవంతం చేయండి: సీపీఐ

గుంతకల్లు టౌన్/తాడిపత్రి, మే 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 2వ తేదీ సోమవారం మండలకేంద్రాల్లోని ప్రభుత్వ కార్యాలయాల వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవిందు పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అర్హులైన పేదలకు పట్టణంలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల చొప్పున స్థలం ఇవ్వాలని, అలాగే ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేయాలని కోరారు. మండలకార్యాలయాల వద్ద జరిగే ధర్నాకు పెద్ద ప్రజలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గకార్యదర్శి వీరభద్రస్వామి, సహాయ కార్యదర్శి మహేష్, పట్టణ సహాయ కార్యదర్శి ఎస్ఎండీ గౌస్, మండల కార్యదర్శి రాము, ఏఐటీయూసీ మండల అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, ఈశ్వరయ్య, నాయకులు పాల్గొన్నారు. అలాగే తాడిపత్రి పట్టణంలోని చింతల వెంకటరమణస్వామి ఆలయ ఆవరణంలో సీపీఎం పట్టణ కార్యదర్శి చిరంజీవియాదవ్ ఈ మేరకు వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ఈనెల 2వ తేదీన చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మరచిపోయిన ఆభరణాల అప్పగింత


మహమ్మద్ వలికి బంగారు ఆభరణాలు అందజేస్తున్న పోలీసులు

గుంతకల్లు టౌన్, మే 31(ఆంధ్రజ్యోతి): ఆటోలో ఓ ప్రయాణికుడు బంగారు, వెండి ఆభరణాలు మరిచిపోగా.. వన్‌టౌన్ పోలీసులు గంట లోపు వాటిని కనుక్కొని బాధితుడికి అప్పగించారు. కర్నూలు జిల్లా చిప్పగిరి మండలం కుందనకుర్తి గ్రామానికి చెందిన ఎస్కే మహమ్మద్ వలి శనివారం ఆదోనిలో 20 తులాల వెండి పట్టీలు, ఒక తులం బంగారు ఆభరణాలు కొనుగోలు చేశాడు. వాటిని బ్యాగ్‌లో ఉంచుకుని రైలులో గుంతకల్లు రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు. అక్కడి నుంచి స్వగ్రామానికి వెళ్లేందుకు ఆటోలో బస్టాండ్‌కు వెళ్లి దిగాడు. అయితే నగలున్న బ్యాగును ఆటోలోనే మరచిపోయాడు. కొద్దిసేపటికి గుర్తురావడంతో చూసుకోగా.. బ్యాగు కనిపించలేదు. వెంటనే అతను వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఐ మనోహర్ ఆదేశాల మేరకు హెడ్‌కానిస్టేబుల్ నాగేశ్వర్ రావు, కానిస్టేబుల్ కుమార్ స్వామి ఆటో ఆచూకీ కోసం రైల్వే స్టేషన్ రోడ్డులో గాలించారు. గంటలోనే ఆటోను గుర్తించి పట్టుకున్నారు. ఆ ఆటో డ్రైవర్ కూడా బ్యాగ్ ఉందని గుర్తించలేదు. ఆటో వెనుక సీటులోనే నగల బ్యాగు ఉండడంతో పోలీసులు తీసుకొని పోలీస్ స్టేషన్‌లో బాధితుడికి అప్పగించారు. దీంతో అతను పోలీసులకు కృతజ్ఞతలు తెలిపాడు.

లిక్కర్ స్కామ్‌లో జగన్ జైలుకెళ్లడం ఖాయం

- ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు
- కుందుర్పి మండలం యర్రగుంటలో పింఛన్ల పంపిణీ

కళ్యాణదుర్గం/కుందుర్పి మే 31(ఆంధ్రజ్యోతి): లిక్కర్ స్కామ్‌లో వైసీపీ అధినేత జగన్ జైలుకెళ్లడం ఖాయమని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు అన్నారు. కుందుర్పి మండలం యర్రగుంట గ్రామంలో శనివారం నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా వచ్చారు. ఈ సందర్భంగా తొలుత విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో పాలకులు జే బ్రాండ్ లిక్కర్‌తో వేల కోట్లు కొల్లగొట్టి బంగారం కొనుక్కున్నారన్నారు. ఇప్పటికే ఈ స్కామ్‌పై ఈడీ, సీబీఐలు పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నాయన్నారు. త్వరలోనే విషయం ఓ కొలిక్కి వస్తుందని, జగన్ జైలుకు వెళతారని అన్నారు. రాజధానికి 500 ఎకరాలు చాలు అని గొప్పలు చెప్పుకునే జగన్‌రెడ్డి సొంత తల్లిని, చెల్లిని గెంటేసి వేల ఎకరాల్లో ప్యాలెస్‌లు ఎందుకు కట్టుకున్నారో చెప్పాలని ప్రశ్నించారు. రాజకీయ లబ్ధి కోసం వైసీపీ ఆర్టీటీ సంస్థను బజారుకీడుస్తోందని విమర్శించారు. వైసీపీ కండువాలు, బ్యానర్లతో ర్యాలీలు చేస్తే ఆ సంస్థ మనుగడకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ఆర్డీటీ మీద ప్రేమ ఉంటే ఢిల్లీ వెళ్లి ధర్నాలు, పాదయాత్రలు చేయాలే కాని, ఇలా స్వార్థ రాజకీయం చేయరాదని హితవు పలికారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్ విషయమై మంత్రి నారాలోకేశ్ అమిత్ షాతో చర్చ లు జరుపుతున్నట్లు చెప్పారు. బీటీపీ కాలువ ప నులు పూర్తి చేసి కళ్యాణదుర్గం నియోజకవర్గంలో 114 చెరువులకు నీరందించడమే తన ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.


దివ్యాంగ మహిళకు పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే

తర్వాత గ్రామంలో ఎమ్మెల్యే సామాజిక భద్రతా పింఛన్లను పంపిణీ చేశారు. ఆర్డీవో వసంత్‌బాబు, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో లక్ష్మీ శంకర్, సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులతో కలిసి పింఛన్‌దారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లు అందజేశారు. అంతకుముందు ఆయనకు గ్రామస్థులు పూలవర్షం కురిపించి అపూర్వ స్వాగతం పలికారు.

టీడీపీతోనే మహిళా సాధికారిత: ఎమ్మెల్యే గుమ్మనూరు

గుంతకల్లు, మే31(ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారిత టీడీపీతోనే సాధ్యమని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. పట్టణంలోని 33వ వార్డులో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మహిళకు ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణా కేంద్రాన్ని శనివారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మాట్లాడుతూ.. మహిళల సంక్షేమానికి అప్పట్లో ఎన్టీఆర్ ఎంతో కృషి చేశారన్నారు. ఇప్పుడు చంద్రబాబు నాయుడు అదేబాటలో పయనిస్తున్నారని చెప్పారు. పొదుపు సంఘాల ద్వారా మహిళా సాధికారతకు విశేష కృషిచేస్తున్నారని చెప్పారు. ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా లక్షమంది మహిళలకు టైలరింగ్ శిక్షణ చేపట్టారన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్ మాట్లాడుతూ.. ఎన్టీఆర్ మహిళలకు ఆస్తిలో సమాన హక్కును హక్కును కల్పించారని, చంద్రబాబు కూడా ఆయన అడుగుజాడల్లోనే మహిళాభ్యున్నతికి పాటుపడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, గుమ్మనూరు వెంకటేశులు, తలారి మస్తానప్ప, గుజరీ ఖాజా, రంగన్న, విద్యారాణి, అరుణ, రాయల్ వెంకటేశులు, విజయలక్ష్మి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.


కుట్టు శిక్షణా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయరాం

పింఛన్ల పంపిణీకి హాజరు..

గుంతకల్లు: పట్టణంలోని బెంచికొట్టాల ఏరియాలో చేపట్టిన పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు, సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులతో కలిసి లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఒకరోజు ముందుగానే పింఛన్లు అందజేయడం గర్వంగా ఉందన్నారు.

మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి చేస్తా

- యార్డు వైస్ చైర్మన్ కోనంకి రాజశేఖర్

కళ్యాణదుర్గం, మే 31 (ఆంధ్రజ్యోతి): కళ్యాణదుర్గం మార్కెట్ యార్డు అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ కోనంకి రాజశేఖర్ పేర్కొన్నారు. పట్టణంలోని మార్కెట్ యార్డులో శనివారం ఆయన మార్కెట్ యార్డు వైస్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని సరేంద్రబాబును పూలమాలలు, శాలువాతో సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ నియోజకవర్గంలో టీడీపీ అభివృద్ధికి తాను చేసిన సేవల్ని గుర్తించి ఎమ్మెల్యే తనకు ఈ అవకాశం కల్పించారని తెలిపారు. తన కష్టానికి గుర్తింపును ఇచ్చినందుకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. తనకు ఇచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటానన్నారు. ఎమ్మెల్యే సహకారంతో మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న కోనంకి రాజశేఖర్, అమరబిందు

కోనంకి అమరబిందు పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు మార్కెట్ యార్డు డైరెక్టర్ సన్మానం

బ్రహ్మసముద్రం: కళ్యాణదుర్గంలో మార్కెట్ యార్డు డైరెక్టరుగా పాలబండ్ల ముత్యాలమ్మ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆమె టీడీపీ నాయకుడు పాలబండ్ల శ్రీరాములుతో కలిసి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబును పూలమాలలు, శాలువాతో ఘనంగా సత్కరించారు. మార్కెట్ యార్డు డైరెక్టరుగా అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎస్ఐ చర్జి కార్యవర్గం ఎన్నిక

గుత్తి, మే 31(ఆంధ్రజ్యోతి): పట్టణం లోని ఆర్ఎస్‌లో గల సీఎస్ఐ చర్చి నూతన కార్యవర్గాన్ని శనివారం చర్చి ఫాదర్ రెవరెండ్ డేవిడ్ నాయక్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చర్చి ప్రధాన కార్యదర్శిగా చార్లెస్, కమిటీ సభ్యులుగా సల్మాన్‌రాజ్, ప్రసాద్‌రావు, రవిబాబు, రుతుకళావతి, రాజకుమారి, షారున్‌బాబు, అనిల్‌కుమార్, స్టెల్లా ఎంపికయ్యారు.

నేమకల్లు ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

బొమ్మనహాళ్, మే 31(ఆంధ్రజ్యోతి) మండలంలోని నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అర్చకులు ఉదయమే ఆలయంలో మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం చేశారు. అనంతరం వివిధ రకాల పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేసి మహామంగళహారతి ఇచ్చారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పొగాకు నివారణపై అవగాహన ర్యాలీ

విడపనకల్లు, మే 31(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పొగాకు నివారణ దినోత్సవం సందర్భంగా మండలకేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు మస్రద్‌జాహా ఆధ్వర్యంలో సిబ్బంది శనివారం ర్యాలీ నిర్వహించారు. వైద్యశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ బస్టాండ్ వరకు కొనసాగింది. అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా వైద్యురాలు మాట్లాడుతూ.. పొగాకు వాడకం వల్ల కలిగే నష్టాలను వివరించారు. ముఖ్యంగా కేన్సర్ బారిన పడతారని చెప్పారు. కనుక పొగాకు, ఇతర మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. పొగాకు వాడకాన్ని అరికట్టేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది మునెమ్మ, సరళ, తులశమ్మ, నూర్‌బాషా, నూర్‌మహమ్మద్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

- యాడికి: మండలకేంద్రంలో ప్రభుత్వ వైద్యశాల వైద్యుడు పరమేశ్వర్, సిబ్బంది కలిసి పొగాకు నివారణపై ర్యాలీ నిర్వహించారు. ప్రధాన వీధుల గుండా ర్యాలీ కొనసాగింది. పొగాకు వాడడం వల్ల కలిగే నష్టాలను వైద్యులు వివరించారు. కనుక వాటి జోలికి వెళ్లరాదని సూచించారు. హెల్త్‌సూపర్‌వైజర్ రాంప్రసాద్‌గౌడ్, ఆరోగ్య సిబ్బంది మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు. రాయల చెరువులోనూ ప్రభుత్వ వైద్యులు దేవరాజన్, అ ప్పయ్య ఆధ్వర్యంలో సిబ్బంది ర్యాలీ నిర్వహించారు.


విడపనకల్లులో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్

విడపనకల్లు, మే 31(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పారిశుధ్యంపై అధికారులు శనివారం స్పెషల్ డ్రైవ్‌నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న కార్మికులతో పాటు గడేకల్లు, హావళిగి గ్రామాల్లోని కార్మికులను పిలిపించి వివిధ కాలనీల్లో పేరుకుపోయిన చెత్తను, డ్రైనేజీల్లో పేరుకుపోయిన పూడిక తొలగింపజేశారు. ఒక్కరోజులోనే గ్రామాన్ని శుభ్రం చేయించారు. ఈఓఆర్డీ సత్యఏసుబాబు, కార్యదర్శి మునాఫ్, సర్పంచ్ చంద్రశేఖర్, టీడీపీ నాయకుడు బండి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పౌరహక్కులపై అవగాహన

బ్రహ్మసముద్రం, మే 31(ఆంధ్రజ్యోతి): పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా మండలంలోని గుండిగానిపల్లి గ్రామంలో శనివారం తహసీల్దార్ సుమతి పౌర హక్కులపై స్థానికులకు అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం అక్కడి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆర్ఐ నాగిరెడ్డి, వీఆర్వో ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌యార్డు లక్ష్యం రూ.1.76 కోట్లు

రాయదుర్గం రూరల్, మే 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్కెట్‌యార్డ్‌లో సుంకం సీలుకు ప్రభుత్వం రూ. 1.76 కోట్లు లక్ష్యాన్ని నిర్దేశించినట్లు మార్కెట్‌యార్డు కార్యదర్శి శ్రీనివాసులు శనివారం ప్రకటనలో తెలిపారు. 2025 ఏప్రిల్ 1 నుంచి 2026 మార్చి 31 వరకు ప్రభుత్వం రూ. 1.76 కోట్లు టార్గెట్ నిర్దేశించగా రెండు మాసాల్లో రూ. 25.54 లక్షల వసూలు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

నేటి నుంచి రేషన్ దుకాణాల వద్దే బియ్యం పంపిణీ

బొమ్మనహాళ్, మే 31(ఆంధ్రజ్యోతి) మండలంలో రేషన్ దుకాణాల వద్దే ఆదివారం నుంచి బియ్యం పంపిణీ చేప ట్టనున్నట్లు తహసీల్దార్ మునివేలు తెలిపారు. మండలకేంద్రంతో శనివారం ఆయన స్టోర్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు పయ్యావుల మోహన్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం రేషన్ షాపుల నుంచే నిత్యావసర సరకులు పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఆదివారం మండలంలోని కురువళ్లి గ్రామంలో రేషన్ షాప్ వద్ద రేషన్ కార్డు ఉన్న లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేస్తున్నామని, మండలంలోని ప్రజా ప్రతినిధులు తప్పక పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

అనారోగ్యంతో రిటైర్డ్ పీహెచ్‌ఎన్ మృతి

యాడికి, మే31(ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ పబ్లిక్ హెల్త్ నర్స్ కమలమ్మ (80) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతిచెందారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో సుదీర్ఘకాలం పాటు పీహెచ్‌ఎన్‌గా పనిచేసిన ఆమె మండలవాసులకు వైద్యసేవలందించి మంచి పే రు గడించారు. వేలమంది గర్భిణులకు ప్రసవాలు చేసి డాక్టర్ కమలమ్మగా పేరుపొందడం గమనార్హం. కమలమ్మ అనే పేరు చెప్పగానే ఆమె గర్భిణులకందించిన సేవలనే స్థానికులు గుర్తు చేసుకుంటారు. ఉద్యోగ విరమణ పొందిన ఆమె గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. శనివారం ఆమె మృతదేహానికి పలువురు రాజకీయనాయకులు, ఆరోగ్యసిబ్బంది పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

హెచ్‌ఐవీ నివారణపై కళాజాతా

బ్రహ్మసముద్రం, మే 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శనివారం ఏపీ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ సంస్థ ఆధ్వర్యంలో జంగం శ్రీనివాసులు కళా బృందం సభ్యులు ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పించేందుకు కళాజాతా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఐవీ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పాటల ద్వారా ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో డెవలప్‌మెంట్ సొసైటీ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ మహేష్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి పద్మ, స్థానికులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

డీ.హీరేహాళ్, మే 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్ధాపురంలో పేకాట స్థావరంపై పోలీసులు శనివారం దాడులు చేశారు. పేకాటాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి రూ. 5400 నగదు, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు.

బౌద్ధ గురువు పాదయాత్ర

డీ.హీరేహాళ్, మే 31(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నేషనల్ హైవేకి ఆనుకొని ఉన్నందున ఆ మార్గం గుండా పలువురు ప్రముఖులు నిత్యం ప్రయాణిస్తుంటారు. అందులో భాగంగానే బౌద్ధ మత గురువు ఆచార్య విమలసాగర్‌జైన్ బెంగళూరు నుంచి బళ్లారికి శనివారం పాదయాత్రగా వెళ్లారు. ఆయన పాదయాత్ర గా వెళ్తున్నారన్న విషయాన్ని తెలుసుకున్న ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్ఐ తన సిబ్బందితో ఈ 11 కి.మీ మేర వెంట నడిచి ఆయన్ను సాగనంపారు.

న్యాయ పోరాటంలో ఎదురుదెబ్బలుంటాయి: కాలవ

రాయదుర్గం, మే 31(ఆంధ్రజ్యోతి): న్యాయం కోసం చేసే పోరాటంలో సాధారణంగా ఎదురుదెబ్బలు తగులుతుంటాయని, వాటిని తట్టుకుని ముందుకెళ్లాలని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు సూచించారు. గత వైసీపీ పాలనలో సోషల్ మీడియాలో వ్యతిరేక పోస్టులు పెట్టారన్న కక్షతో అప్పటి పాలకులు టీడీపీ నాయకులైన గుమ్మఘట్ట మండలం శిరిగేదొడ్డికి చెందిన మేకల తిప్పేస్వామి, కిందింటి హరినాథ్, అట్టయ్య గారి పరమేషపై అక్రమకేసులు బనాయించి వేధించారు. అయితే వారు ధైర్యంగా వాటిని ఎదుర్కొని న్యాయస్థానాన్ని ఆశ్రయించగా కోర్టు ముగ్గురిపైనా కేసులు కొట్టివేసింది. దీంతో వారిని కాలవ శ్రీనివాసులు పట్టణంలో శనివారం కలిసి అభినందించారు. ఇలాంటి న్యాయ పోరాటంలో ఎదురుదెబ్బలు తగులుతుంటాయని, వాటిని తట్టుకుని పోరాడినప్పుడే మన సత్తా ఏమిటో బయట పడుతుందని అన్నారు.

గొల్లపల్లిలో పింఛన్ల పంపిణీ..


గొల్లపల్లిలో దివ్యాంగ బాలుడికి పింఛన్ అందిస్తున్న కాలవ శ్రీనివాసులు

గుమ్మఘట్ట: మండలంలోని గొల్లపల్లి గ్రామంలో సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీలో కాలవ శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ పేదల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. జూన్ ఒకటోతేదీ ఆదివారం సెలవు రోజు కావడంతో ఒకరోజు ముందే పింఛన్లు అందజేసి పేదల పట్ల తమకున్న చిత్తశుద్ధిని ప్రభుత్వం చాటుకుందని పేర్కొన్నారు. టీడీపీ మండల కన్వీనర్ గిరిమల్లప్ప, క్లస్టర్ ఇన్‌చార్జి కాలవ సన్నన్న, నాయకులు ముత్తన్న, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అశ్మిత్ పింఛన్ల పంపిణీ


వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే

తాడిపత్రి, మే 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మెయిన్‌బజారుతో పాటు పలు వీధుల్లో ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి శనివారం పర్యటించి లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూన్ 1వ తేదీన ఆదివారం సెలవు ఉండడంతో ప్రభుత్వం ముందుగానే పింఛన్ పంపిణీ చేపట్టిందని తెలిపారు. ఇది ఎంతో ఆనందాన్ని కలిగిస్తోందని అన్నారు. చెప్పిన వన్నీ ముఖ్యమంత్రి చంద్రబాబు అమలు చేస్తారని పేర్కొన్నారు. కౌన్సిలర్లు అబ్దుల్‌రహీం, మల్లికార్జున, విజయ్‌కుమార్, రేష్మాపర్వీన్, జింకా లక్ష్మీదేవి పాల్గొన్నారు.

గుత్తి ఆర్ఎస్‌లో పోలీసుల నాకాబందీ

గుత్తి, మే 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్ఎస్‌లో గల ఎస్సీ కాలనీలో ఎస్ఐ సురేష్ సిబ్బందితో కలిసి శనివారం నాకా బందీ నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానస్పద ఇళ్లను తనిఖీ చేశారు. పలు వాహనాల రికార్డులను పరిశీలించారు.

విత్తన వేరుశనగకు పేర్లు నమోదు చేసుకోండి

బెళుగుప్ప/శెట్టూరు/బ్రహ్మసముద్రం, మే 31(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్‌లో వేరుశనగ పంట సాగు చేసే రైతులు విత్తన వేరుశనగ పొందేందుకు తమ పేర్లను నమోదు చేయించుకోవాలని బెళుగుప్ప, శెట్టూరు, బ్రహ్మసముద్రం మండలాల వ్యవసాయాధికారులు లీనా వసుంధర, వాసుకీరాణి, సరిత శనివారం వేర్వేరు ప్రకటనలలో తెలిపారు.అవసరమైన రైతులు ఆయా రైతుసేవా కేంద్రాలకు ఆధార్, భూమి పాసుపుస్తకం, మొబైల్ తీసుకెళ్లి పేర్లను నమోదు చేయించుకోవాలని సూచించారు. 40 శాతం సబ్సిడీతో ప్రభుత్వం వాటిని అందజేయనున్నట్లు చెప్పారు. బెళుగుప్ప మండలానికి 1300 క్వింటాళ్లు, బ్రహ్మసముద్రం మండలానికి కే6 రకం 2800 క్వింటాళ్లు, లేపాక్షి రకం వంద క్వింటాళ్ల విత్తన వేరుశనగను కేటాయించినట్లు పేర్కొన్నారు.

తిమ్మంపల్లిలో ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠ


ప్రతిష్ఠించిన వేంకటరమణ స్వామి విగ్రహం

యల్లనూరు, మే 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మంపల్లిలో వేంకటరమణస్వామి విగ్రహ ప్రతిష్ఠను శనివారం ఘనంగా నిర్వహించారు. నూతన ఆలయ ప్రారంభోత్సవ వేడుకల్లో భాగంగా చివరిరోజున అర్చకులు శ్రీదేవి, భూదేవి సమేత వేంకటరమణస్వామి విగ్రహాలను ఆలయంలో ఉదయం 10గంటలకు వేద మంత్రోచ్చారణల నడుమ, యాగాలు, హోమాలు చేసి ప్రతిష్ఠించారు. అనంతరం ప్రత్యేక అలంకరణలు, పూజలు జరిపారు. భక్తులు పెద్దఎత్తున స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన రాతిదూలం పోటీలకు 13జతల వృషభాలు పాల్గొన్నాయి.

ప్రతిష్ఠలో పాల్గొన్న పలువురు నాయకులు

తిమ్మంపల్లిలో జరిగిన విగ్రహప్రతిష్ఠ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యేలు కేతిరెడ్డి పెద్దారెడ్డి, కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ మంత్రులు ఉషశ్రీ, శైలజానాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన

పెద్దవడుగూరు, మే31(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని రైతుసేవా కేంద్రంలో శనివారం రైతులకు ఆధునిక వ్యవసాయ సాగు విధానంపై జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ అవగాహన కల్పించారు. రైతులు ఖరీఫ్‌లో పొలాల్లో దుక్కులు చేయడం వల్ల భూమిలోపల ఉండి పంటను ఆశించే క్రిమికీటకాలు నశిస్తాయన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేందుకు అవసరమైన సలహాలు, సూచనలు ఇచ్చారు. కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు మల్లేశ్వరమ్మ, కిషోర్ వ్యవసాయ అధికారి మల్లేశ్వరి, సునీత, రైతులు పాల్గొన్నారు.